నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065438 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 23-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:71 పేజీలు:6 వెల: రూ.1/-

## నేటి కందం-నేటికి అందం

తీరుగ వైద్యమ్మును చి
న్నారుల కందించు కొరకు నయగారపు గుం
టూరు పురమ్మున నిలిపిరి
పోరామి నొసంగు " రెయిను బో " ఆస్పత్రిన్ !!

(గుంటూరు లో చిన్నపిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు యాభై పడకల "రెయిన్ బో ఆసుపత్రి "ప్రారంభింప బడింది. దీని వలన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

## చురక

పరిపాలన మార్పుకు
ప్రయత్నాలు ముప్పు
అంటున్నది విద్వేషపు
ఆరెస్సెస్ తల కొప్పు.
నిరసనలు ఉద్యమాలు
నేరమేమి కాదు కదా
రాజ్యాంగం హక్కులపై
రెచ్చి దాడి ఎలా సదా



-వేల్పుల నారాయణ
9440433475

# మా ప్రభుత్వంలో ముదిరాజ్‌లను భాగస్వాములను చేసే బాధ్యత నాది: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 22: తమ ప్రభుత్వంలో ముదిరాజ్‌లను భాగస్వాములను చేసే బాధ్యత తనదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు ఎన్టీఆర్ రూ.2లకు కిలో బియ్యం ఇస్తే.. తాము సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు. 3.48 కోట్ల మందికి నేడు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈరోజు (శుక్రవారం) హైదరాబాద్‌లో పండుగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజులేనని తెలిపారు.

ముదిరాజులు విశ్వాసనీయమైన వారని కొనియాడారు. స్వాములు తన భూమిని ఆక్రమించుకొన్నప్పుడు పండుగ సాయన్న ఎదురుతిరిగారని తెలిపారు. నిజాం హయాంలో దొరలు పేదలభూములను ఆక్రమిస్తుంటే పేదలకు అండగా పండుగ సాయన్న నిలిచారని ప్రశంసించారు. దొరలకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారని తెలిపారు. సాయన్నను నిజాం పోలీసులు అరెస్టు చేస్తే నాటి వనపర్తి మహారాణి పెద్దఎత్తున నిధులు చెల్లించి సాయన్నను విడిపించారని ప్రస్తావించారు.

# కులమతాలకు అతీతంగా కలిపే వేదిక.. అలాయ్ బలాయ్: బండారు దత్తాత్రేయ



హైదరాబాద్, అక్టోబర్ 22: కులమతాలు, రాజకీయాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే కార్యక్రమమే అలాయ్ బలాయ్ అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వ్యక్తుల మధ్య ఎన్ని భిన్నాభిప్రాయాలు, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి ఆత్మీయంగా కలుసుకోవాలని, ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకోవాలని పిలుపునిచ్చారు.

స్నేహభావం, ఐక్యతను పెంపొందించడమే అలాయ్ బలాయ్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పండుగ స్ఫూర్తితో సమాజంలో సోదరభావం, సామరస్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ విభేదాలు ఏవైనా.. పండుగల వేళ అందరూ కలిసి ఆనందాన్ని పంచుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తుందని వివరించారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ అభివృద్ధి చెందాలని బండారు దత్తాత్రేయ ఆకాంక్షించారు. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని.. ప్రాంతీయ భేదాలకు తావులేకుండా ఐకమత్యంతో ప్రగతి సాధించాలని అన్నారు. ఈసారి 'నషా ముక్త్ భారత్.. వికసిత్ భారత్' నినాదంతో అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పండుగలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా సమాజానికి మంచి సందేశాన్ని అందించే వేదికలుగా నిలవాలని ఆయన అభిప్రాయపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ, పరస్పర ప్రేమాభిమానాలను పంచుకుంటూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

# 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించాలి: వెంకయ్య నాయుడు



హైదరాబాద్, అక్టోబర్ 22: దేశ ప్రజలందరికీ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అలాయ్ బలాయ్, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆకలి, దప్పులు లేని సమాజాన్ని నిర్మించడంతో పాటు అవినీతికి, అఘాయిత్యాలకు తావులేని దేశంగా భారత్‌ను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

గతంలో భారతీయుల మధ్య ఉన్న విభేదాలను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని పాలించారని, ఆ క్రమంలో మన సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీశారని గుర్తుచేశారు. అందువల్ల ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మనుషుల మధ్య ప్రేమను పంచుతూ, ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేసే గొప్ప వేదిక అలాయ్ బలాయ్ అని అన్నారు. మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన మధ్య ఉన్న అనుబంధాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు.

# రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి : బీవీ రాఘవులు





నల్గొండ, అక్టోబర్ 22: పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూర్ సభ్యుడు బి.వి.రాఘవులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో వరి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, సాగు కోసం పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతుల దుస్థితిని ప్రభుత్వాలు అర్థం చేసుకుని వారికి తగిన సహాయం అందించాలని కోరారు.

గురువారం నల్లగొండ నగరంలోని సీపీఐ(ఎం) కార్యాలయం దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహాయం సరిపోదని అన్నారు. రైతుల నష్టాలను పరిగణనలోకి తీసుకుని వారికి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు అత్యవసరంగా అవసరమన్నారు. గ్రామీణ పేదలకు పని కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని పేర్కొన్నారు.

విజయదశమి రోజున ప్రధానమంత్రి జాతీయ సమైక్యత గురించి మాట్లాడారన్నారు. అయితే ప్రస్తుతం దేశంలో జాతీయ సమైక్యతకు బీజేపీ ప్రభుత్వమే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులను సృష్టిస్తోందని విమర్శించారు.

ప్రతిపక్షాలను బలహీనపరచాలని, రాజకీయంగా విడగొట్టాలని చూస్తున్న ధోరణి దేశ సమైక్యతను దెబ్బతీస్తుందన్నారు. దేశ సమైక్యతను కాపాడాలంటే ప్రజలను విభజించే విధానాలను విడనాడాలని పేర్కొన్నారు.

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని బి.వి. రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం పార్లమెంటు స్థానాలను కేటాయిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాల సంఖ్య అధికంగా పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో 93 లక్షల మంది ఓటర్లను తొలగించారని బి.వి. రాఘవులు పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించడం ద్వారా దేశ సమైక్యతను ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాల రూపకల్పనలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించాలని అన్నారు. జనాభా లెక్కల సేకరణలోనూ పారదర్శకత ఉండాలని రాఘవులు సూచించారు.

సమాజంలోని అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పించే విధంగా కులగణన చేపట్టాలని, సామాజిక న్యాయం సాధించే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సౌదీ అరేబియాలో ఎయిర్‌పోర్టుపై హౌతీల దాడి.. భారతీయుడు సహా ఇద్దరు మృతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22:సౌదీ అరేబియాలోని ఎయిర్‌పోర్టుపై హౌతీలు దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు మరణించారు. వారిలో ఒకరు భారతీయుడు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లో ఉన్న కింగ్ ఫహద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీలు బుధవారం రాత్రి దాడి చేశారు. 20 రాకెట్లతో హౌతీ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు మరణించారు. వారిలో ఒకరు భారతీయుడు.

మరో ఎనిమిది మంది గాయపడగా.. వారిలో ఇద్దరు ఇండియన్స్ ఉన్నారు. ఈ విషయాన్ని గురువారం సౌదీ అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిలో ఎయిర్‌పోర్ట్ కూడా భారీగా ధ్వంసమైంది. అయితే, దాడి తర్వాత ఎయిర్‌పోర్టు నుంచి విమానయాన కార్యకలాపాలు కొనసాగాయా.. లేదా అనే విషయంపై స్పష్టత లేదు. దమ్మామ్ ఎయిర్‌పోర్టు సౌదీ అరేబియాలోని ఈస్టర్న్ ప్రావిన్స్‌లో అత్యంత కీలకమైంది. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కావడంతో హౌతీలు దీన్ని లక్ష్యంగా ఎంచుకున్నారు. మరోవైపు భారతీయుడు మృతిచెందడంపై సౌదీ అరేబియాలోని ఇండియన్ ఎంబసీ ప్రకటన చేసింది. ఎయిర్‌పోర్టుపై హౌతీలు జరిపిన దాడిలో ఒక భారతీయుడు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డట్లు సౌదీ ప్రభుత్వం తమకు తెలిపిందని ఎంబసీ వెల్లడించింది. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించింది. బాధితుల కుటుంబాన్ని సంప్రదిస్తున్నామని వివరించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. యెమెన్ దేశంలోని తిరుగుబాటు సైన్యం హౌతీలు. వీరికి ఇరాన్ మద్దతు ఇస్తోంది. అలాగే, యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతు ఇస్తోంది. ఈ నేపథ్యంలో హౌతీలు.. సౌదీ అరేబియాపై దాడులకు దిగుతున్నారు.

# సముద్రం పేరు మారుస్తానంటే.. పిచాయ్ నో చెప్పారు: ట్రంప్



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22: అట్లాంటిక్ మహాసముద్రం పేరు మార్పునకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అస్సలు అంగీకరించలేదని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తెలిపారు. 'నేను పేరు మారుద్దామని అన్నాను.. ఆయనేమో వద్ద వద్దు.. ఈసారి నా వల్ల కాదని అన్నారు' అని ఇటీవల టెన్నిస్సీ రాష్ట్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ట్రంప్ తెలిపారు. 'సర్.. సముద్రాల వ్యవహారం వేరు. అవి చాలా దేశాలతో ముడిపడి ఉంటాయి. దయచేసి అలా చేయాలని మాత్రం అనొద్దు' అని పిచాచ్ చెప్పినట్టు వివరించారు. పదవిలోంచి దిగిపోయే లోపు అట్లాంటిక్ మహాసముద్రం పేరును అమెరికా సముద్రంగా మార్చాలని యూఎస్ అధ్యక్షుడు ఉవ్విళ్లూరుతున్న విషయం తెలిసిందే.

ఏదైనా సముద్రానికి అమెరికా పేరు ఉంటే బాగుంటుందని ఎవరో తనకు సూచించినట్లు ట్రంప్ చెప్పుకొచ్చారు. 'గల్ఫ్ (గల్ఫ్ ఆఫ్ మెక్సికో) పేరును మార్చాం. సరస్సు (ఓంటారియో) పేరును కూడా మార్చుకున్నాము. ఏదైనా నదికి కూడా అమెరికా పేరు పెట్టాలని ఎవరో సూచించారు. దాంతో పాటు సముద్రం పేరు మార్చాలని కూడా అన్నారు. ట్రంప్ సముద్రమని పిలిస్తే బాగుంటుందని నాకు అనిపించింది' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

ఇటీవలే గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును ట్రంప్ గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చిన విషయం తెలిసిందే. కెనడాతో సరిహద్దుగా ఉన్న ఓంటారియో సరస్సును కూడా అమెరికా సరస్సుగా మార్చేశారు. ట్రంప్ ఆదేశాల మేరకు గూగుల్ మ్యాప్స్‌లో లేక్ ఓంటారియో పేరు లేక్ అమెరికాగా మారింది.

అయితే, ఈ మార్పు కేవలం అమెరికన్ గూగుల్ మ్యాప్స్‌లో మాత్రమే కనిపిస్తుందని చెప్పింది. కెనడా వాసులకు మాత్రం లేక్ ఓంటారియోగానే ఉంటుందని పేర్కొంది. ఇతర దేశాల వారికి మాత్రం ఓంటారియో పేరు పక్కన లేక్ అమెరికా పేరు బ్రాకెట్స్‌లో కనిపిస్తుందని గూగుల్ ఒక ప్రకటనలో తెలిపింది.

# భవానీ భక్తుల మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

అమరావతి,అక్టోబర్ 22:కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద భవానీ దీక్షలో ఉన్న నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. భవానీ భక్తుల మృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

భవానీ దీక్షలో ఉన్న నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై సీఎం సంతాపం తెపారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి దర్శనం కోసం కాలినడకన వస్తున్న భవానీ భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# ఏపీలో 26,27వ తేదీల్లో ఉప రాష్ట్రపతి పర్యటన

అమరావతి,అక్టోబర్ 22:భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆంధ్ర ప్రదేశ్ లో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈనెల 26, 27వ తేదీల్లో విజయవాడ తిరుపతి జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు ఈనెల 26న ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి అంబేద్కర్ స్మృతి వనానికి వెళ్లనున్నారు .

అంబేద్కర్ కళావేదిక లో జరగనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో 40 ఏళ్ల రూబీ జూబ్లీ వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు .మధ్యాహ్నం తిరుపతికి చేరుకొని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. రాత్రి తిరుపతిలో బస అనంతరం 27న ఉదయం పద్మావతి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని తిరుపతి విమానాశ్రయం నుంచి తిరిగి బయలుదేరుతారని ఏపీ అధికారులు వెల్లడించారు.

ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు
శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన





డా॥ పట్టాభి కళా పీఠము
(ప్రతిభకు పట్టాభిషేకం)
(రి. 234/2010)
ఫ్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి –
పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ
(సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : 14-11-2026 (2వ శనివారం)
వేదిక : పెన్షనర్ల భవనం
తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం
సభాధ్యక్షులు :
డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్
అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము

ముఖ్య అతిథి :
గౌ॥ శ్రీమతి పొడపాటి తేజస్విని గారు
అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి

విశిష్ట అతిథి :
ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు
ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

# జీవ వైవిధ్య పరిరక్షణలో మంచు చిరుతపులులు !

## (23 అక్టోబర్ "అంతర్జాతీయ మంచు పులులు దినోత్సవం" సందర్భంగా)

మంచు పర్వతాలకు అందాలను అద్దే జంతువులుగా "మంచు చిరుత పులులు" లేదా "స్నో లిపర్డ్స్"లు మన మనసులను దోచుకుంటూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మంచు చిరుత పులుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ, జీవ వైవిధ్యానికి విఘాతంగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వీటి సంఖ్య 3,920 నుంచి 6,590 వరకు మాత్రమే ఉండడాన్ని గమనించారు. వీటి వాస్తవ సంఖ్యను నిర్ధారించడం కష్టమే అయినప్పటికీ అంచనాలు వేయడం కొనసాగుతున్నది. ప్రపంచ దేశాల్లో మంచు చిరుతల సంఖ్య అత్యధికంగా చైనా (2,000 – 2,500)లో ఉండగా, మంగోలియా రెండవ స్థానంలో నిలిస్తున్నది. ఈ రెండు దేశాలతో పాటు ఇండియా, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, భూటాన్ లాంటి మరో 12 దేశాల్లో కూడా ఈ జంతువులు మనుగడ సాగిస్తున్నాయి.

### అంతర్జాతీయ మంచు చిరుత పులుల దినోత్సవం :

"అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం (ఐయూసిఎన్)" అధ్యయనాల ప్రకారం మంచు చిరుత పులుల మనుగడ ప్రశ్నార్థకంగా మారినుందని హెచ్చరిస్తున్నది. అంతరించే జీవ జాతుల జాబితాలో చేరడానికి దగ్గరగా ఉందని, ఈ జంతువులను పరిరక్షించుకోని యెడల రానున్న తరాలకు ఇవి కనిపించకుండా పోతాయని, కేవలం ఫోటోల్లో లేదా వీడియోల్లో మాత్రమే చూడాల్సి వస్తుందని విన్నవిస్తున్నారు.

ఈ గంభీరమైన విషయాన్ని గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ, వీటిని పరిక్షించుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం ఏర్పడిందని తెలుపుతూ ప్రతి ఏట 23 అక్టోబర్ రోజున "అంతర్జాతీయ మంచు చిరుత పులుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ది స్నో లిపర్డ్స్)" పాటించాలని ప్రపంచ దేశాలను కోరుతున్నది.

### మంచు చిరుత పులులు తగ్గడానికి కారణాలు:

కాల క్రమంలో మంచు చిరుతల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణాలుగా ప్రతికూల వాతావరణ మార్పులు, ఎముకలు/వెంట్రుకల కోసం అక్రమ వేటలు, సహజ ఆహారం అందక పోవడం, మానవ తప్పిదాలతో వీటి సంఖ్య తగ్గడం, వీటి ఆవాసాలు క్రమంగా కుచించుకుపోవడం లాంటివి ఉన్నాయి. అత్యధిక ఎత్తులపై మంచు పర్వతాల్లో నివసించగల మంచు చిరుతలు గర్జించలేవు. ఇవి ఒక రాత్రి పూట 25 మైళ్ల వరకు పరుగు తీయగలవు.

వీటికి ఆహారంగా బ్లూ షీప్స్, ఐబెక్స్, హిమాలయన్ తెహర్, మర్మోట్, పీకా, హేర్స్, స్మల్ రొడెంట్స్ లాంటివి ఉపయోగపడుతున్నాయి. మంచులో కలిసి పోగల చర్మం వీటికి రక్షణగా నిలుస్తున్నది. దాదాపు 30 అడుగుల వరకు పైకి దూకగలుగుతుంది.

దాదాపు 18 ఏండ్ల పాటు జీవించగలిగే మంచు చిరుత పులులు అరుదైన, అందమైన, అమాయక జీవులుగా మానవ ఆవాసాలకు దూరంగా మంచు పర్వతాల్లో సంచరిస్తున్నాయి. అయినప్పటికీ మానవ అనాలోచిత స్వార్థ వాంఛనీయ లేదా అవాంఛనీయ తప్పిదాలతో వీటి సంఖ్య తగ్గడం రాబోయే జీవ వైవిధ్య ప్రమాదాన్ని సూచిస్తున్నది. వీటి మనుగడకు అవసరమైన నీరు, ఆహారం, ఆరోగ్యకర జీవనాలను కల్పిస్తూ వీటి శ్రేయస్సుకు పాటుపడదాం.

రేపటి తరాలకు వీటిని అరుదైన ఆస్తులుగా బహుకరిద్దాం.



-మధుపాలీ
9949700037

# ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ, ఉన్నత విద్య లక్ష్యాల సాధన దిశగా

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22:ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించే విద్యార్థులు తమ ఆర్థిక పరిమితులను అధిగమించి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగడంలో ఆర్థిక సహాయం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోంది.

తెలంగాణలోని హను మకొండ జిల్లాకు చెందిన డాక్టరల్ పరిశోధక విద్యార్థి అర్జున్ కుమార్ (పేరు మార్పు) ప్రయాణం గమనిస్తే షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల జాతీయ ఫెలోషిప్ (ఎన్ఎఫ్ఎస్సీ) పథకం ద్వారా అందే సహాయం విద్యాంర్థులు తమ పరిశోధనను కొనసాగించేందుకు, విద్యాపరమైన లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగేందుకు ఎలా తోడ్పడుతుందో తెలియజేస్తుంది.

ఆర్థికంగా ఎంతో వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన అర్జున్ కుమార్ ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో అనేక ఆర్థిక, సామాజిక అడ్డంకులను ఎదుర్కొన్నారు. తగినంత డబ్బు లేని కారణంగా చదువును కొనసాగించడం, పరిశోధనను ముందుకు తీసుకెళ్లడం ఆయనకు కష్టంగా మారింది. అయినప్పటికీ, ఈ సవాళ్లకు వెరవకుండా పీహెచ్‌డీ పూర్తి చేసి, ప్రొఫెసర్‌గా ఎదగాలన్న తన చిరకాల ఆకాంక్షను నెరవేర్చుకోవాలనే పట్టుదలతో ముందుకు సాగారు.

2022లో ఎన్ఎఫ్ఎస్సీ పథకం కింద సహాయం అందడం ప్రారంభమైనప్పటి నుంచి ఆయన జీవితంలో గణనీయమైన మార్పు మొదలైంది. ఈ ఫెలోషిప్, అదనపు ఖర్చుల కోసం అందిన ఆర్థిక సహాయం ద్వారా డాక్టరల్ చదువులకు సంబంధించిన ఖర్చులను నిర్వహించుకుంటూ పరిశోధనను కొనసాగించగలిగారు. ఆయన విద్యాభ్యాసానికి ఆటంకం కలిగించే స్థాయికి చేరిన ఆర్థిక ఒత్తిడి ఈ సహాయంతో తగ్గింది. ఫలితంగా చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశం లభించింది.

ఈ ఆర్థిక సహాయం ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటానికి కూడా దోహదపడింది. పీహెచ్‌డీ కొనసాగిస్తూనే అర్జున్ కుమార్ తన కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవగలిగారు. ఈ సహాయం వల్ల కుటుంబ అవసరాలను తీర్చడంలో తన వంతు తోడ్పాటు అందిస్తూనే, విద్యాపరమైన లక్ష్యాల సాధన దిశగా మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలుగుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ పరిశోధనను కొనసాగించేందుకు తోడ్పడటం ద్వారా ఈ ఫెలోషిప్ ఆయన విద్యా, వ్యక్తిగత జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చింది. ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఆయన ఆత్మవిశ్వాసాన్ని మరింత బలోపేతం చేసింది. లక్షిత విద్యా సహాయం ద్వారా పరిశోధక విద్యార్థులు ఆర్థిక అడ్డంకులను అధిగమిస్తూ, తమ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనపై నిబద్ధతతో ముందుకు సాగవచ్చని అర్జున్ కుమార్ అనుభవం తెలియజేస్తోంది.

ప్రొఫెసర్ కావాలన్న లక్ష్యంతో అర్జున్ కుమార్ తన పీహెచ్‌డీ కొనసాగిస్తున్నారు. ఉన్నత విద్య, పరిశోధన అవకాశాలను విస్తరించడంలో నిరంతర ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ప్రయాణం తెలియజేస్తోంది. పరిశోధక విద్యార్థులు తమ కుటుంబాలకు అండగా నిలుస్తూ, దేశ విద్యా, మేధో వికాసానికి తోడ్పడేలా ఈ సహాయం దోహదపడుతోంది.

# రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

**-ఈ నెల 24న ఖానాపూర్‌లో అఖిలపక్ష ప్రజా సంఘాల భేటీ**

**కులగణన, ఎస్ఐఆర్ సర్వే విధానాలపై వామపక్షాల ఆగ్రహం**

ఆదిలాబాద్, అక్టోబర్ 22: ఈ నెల 24న ఖానాపూర్ పట్టణంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న అఖిల పక్ష ప్రజా సంఘాల రౌండ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో వామపక్ష నాయకులు సమావేశమై, అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆరోపిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ కులగణనపై స్పష్టమైన ప్రకటన చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని నాయకులు ఆరోపించారు. బీసీలకు నిరంతరం అన్యాయం జరుగుతోందని, వారు అన్ని రంగాల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వామపక్షాలు ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

విద్య, వైద్యం, రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై కుట్ర చేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీల పోరాటాలు దేశవ్యాప్తంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, సహాయ కార్యదర్శి బుక్క సురేందర్, కే. సంజీవ్, నవ తెలంగాణ బీడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవ భోజన్న, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు, బీఎల్ఎఫ్ జిల్లా నాయకులు సూర రాజన్న, బీ. నరసయ్య, చుక్కల కళ, బీడీ యూనియన్ జిల్లా నాయకురాలు పీ. స్వరూప, అఖిల భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శిరీష, మధు, కమల, రాజేందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జాతీయ పోలీసు స్మారకం వద్ద నివాళి కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారకం వద్ద జరిగిన కార్యక్ర మంలో కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'మాదకద్రవ్యాలపై పోరాటం' అనే సందేశంతో చేపట్టిన దేశవ్యాప్త మోటార్‌సైకిల్ ర్యాలీని కూడా హోం మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు శ్రీ కృష్ణ ప్రసాద్ తెన్నేటి, శ్రీ రాజీవ్ కుమార్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ శ్రీ మహేష్ దీక్షిత్, ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ శత్రుజీత్ కపూర్ ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాల డైరెక్టర్ జనరళ్లు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన ధైర్యవంతులైన పోలీసు సిబ్బందికి నివాళులర్పించేందుకు జాతీయ పోలీసు స్మారక స్థలం వద్ద తామంతా సమావేశమైనట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచిన అనంతరం నేడు భారత్ ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘనతకు పునాది మన వీర సిబ్బంది చేసిన త్యాగాలేనని స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతను కాపాడటంతో పాటు సరిహద్దుల రక్షణ కోసం ఆ సిబ్బంది తమ ప్రాణాలను అత్యున్నతంగా త్యాగం చేయకపోయి ఉంటే, నేడు మన దేశం ఏ స్థితిలో ఉండేదో ఎవరూ ఊహించలేరని కేంద్ర మంత్రి అన్నారు.

2026 సంవత్సరం భారత పోలీసు వ్యవస్థకు అత్యంత కీలకమైనదని, దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న నక్సలిజం నుంచి 2026 మార్చి 31న భారత్ విముక్తి సాధించిందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. 1981 నుంచి 2026 మార్చి వరకు నక్సలిజం కారణంగా దేశం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొందని తెలిపారు. ఈ కాలంలో ఎంతోమంది ధైర్యవంతులైన భద్రతా సిబ్బంది, అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఐదు

ఆ పురోగతికి 3,600 మంది సిబ్బంది చేసిన త్యాగాలే మూలస్తంభాలని హోం మంత్రి స్పష్టం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఈ విషయాన్ని తెలియజేయాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాణ త్యాగం చేసిన వీరుల లోటును ఏనాటికీ భర్తీ చేయలేమని, అయినప్పటికీ వారి కుటుంబాలు కనబరిచిన నిబద్ధతకు, చేసిన త్యాగానికి దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని హోం మంత్రి తెలిపారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ చరిత్రను గుర్తుచేస్తూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని మారుమూల, అత్యంత క్లిష్టమైన హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిని ధైర్యంగా ప్రతిఘటిస్తూ 10 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రాణత్యాగం చేశారని శ్రీ అమిత్ షా తెలిపారు. హాట్ స్ప్రింగ్స్ ఘటనను పరిశీలిస్తే, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో యుద్ధం జరిగినప్పుడు దాని ఫలితం దాదాపు ముందే నిర్ణయమై ఉంటుందని స్పష్టమవుతుందని అన్నారు. అయినప్పటికీ, దేశ భూభాగంలో ఒక్క అంగుళం నేల కూడా విదేశీయుల చేతుల్లోకి వెళ్లకూడదన్న దృఢ సంకల్పంతో ఆ అమర వీరులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అత్యున్నతంగా త్యాగం చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బంది గౌరవార్థం న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2018లో ప్రారంభించారని అమిత్ షా గుర్తుచేశారు. పోలీసు సిబ్బంది తమ బాధ్యతల పట్ల అంకితభావంతో వ్యవహరిస్తూ, విధి నిర్వహణలో అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండేలా భావితరాలకు స్ఫూర్తినివ్వడమే ఈ స్మారకం ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ పోలీసు స్మారక స్థూపం దేశవ్యాప్తంగా ఉన్న పౌరులకు ఒక పవిత్ర నివాళి కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. విధుల నిర్వహణలో ప్రాణాలర్పించిన 36,852 మంది పోలీసు సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించేందుకు, వారి అమూల్యమైన సేవలకు, త్యాగానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు దేశవ్యాప్తంగా ప్రజలు ఈ ప్రాంతాన్ని దర్శిస్తున్నారని పేర్కొన్నారు.

పౌరులు రక్షాబంధన్, హోలీ, దీపావళి, ఈద్ వంటి పండుగలను ఆనందంగా జరుపుకుంటారని, అయితే పోలీసు సిబ్బందికి మాత్రం ఈ పండుగలను జరుపుకునేందుకు తరచూ సెలవులు కూడా ఉండవని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబాలతో కలిసి పండుగలను ఆనందంగా జరుపుకుంటున్న సమయంలో పోలీసు సిబ్బంది అంతర్గత భద్రతను కాపాడటం, ట్రాఫిక్‌ను నియంత్రించడం, ప్రజల ప్రాణాలకు, భద్రతకు రక్షణ కల్పించడం వంటి విధుల్లో నిమగ్నమై ఉంటారని తెలిపారు. జీవితంలో అత్యంత విలువైన యువ ప్రాయాన్ని కుటుంబానికి దూరంగా ఉంటూ దేశ సేవకు అంకితం చేయడం గొప్ప సేవ అని హోం మంత్రి అన్నారు.

దేశవ్యాప్తంగా పోలీసు సిబ్బంది అసాధారణ సహనం, సంయమనం, క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, అంకితభావంతో వ్యవహరిస్తూ దేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని శ్రీ అమిత్ షా అన్నారు. అంతర్గత భద్రతకు పోలీసు సిబ్బందే మొదటి, చివరి రక్షణ కవచమని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ, దేశ అంతర్భాగంలో భద్రతా బాధ్యతలు చేపడుతున్న కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, ఎన్నికలు, పండుగలు, నిరసనలు, సరిహద్దుల భద్రత వంటి ప్రతి సందర్భంలోనూ ఈ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ దేశ అంతర్గత భద్రతను బలోపేతం చేస్తున్నారని అన్నారు. దేశ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు వారు నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలోనైనా, ప్రజాస్వామ్య ప్రక్రియలు సజావుగా సాగేందుకు భరోసా కల్పించడంలోనైనా కేంద్ర సాయుధ పోలీసు బలగాల సేవలు లేకుండా ఈ లక్ష్యాలను సాధించడం అసాధ్యమని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ఎన్నికల హింసను అరికట్టడంలో భారత్ విజయం సాధించిందని, అయితే పశ్చిమ బెంగాల్‌లో చాలా కాలంగా ఎన్నికల హింస కొనసాగుతూ వచ్చిందని శ్రీ అమిత్ షా అన్నారు. ఇటీవల ముగిసిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మరణం కూడా సంభవించకుండా ఎన్నికలు పూర్తయ్యేలా భద్రతా సిబ్బంది కృషి చేయడం గణనీయమైన విజయమని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పాయని తెలిపారు. దేశంలో ఎన్నికల హింసకు ముగింపు పలికిన విషయాన్ని ఇప్పుడు యావత్ దేశం గుర్తిస్తోందని ఆయన అన్నారు.

గత కొన్నేళ్లుగా దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందని, వాటిలో మూడు సమస్యలు దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చాయని శ్రీ అమిత్ షా అన్నారు. మూడు ప్రధాన సమస్యాత్మక ప్రాంతాలైన కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి నెలకొందని, ఈ ప్రాంతాల్లో అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని, దేశంలోని ఇతర ప్రాంతాలతో అభివృద్ధిలో పోటీపడేందుకు అవి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో గణనీయమైన విజయం సాధించామని శ్రీ షా అన్నారు. పలు ఒప్పందాలు కుదరడం, వేలాది మంది ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవడంతో ఈశాన్య భారతం మొత్తం శాంతి మార్గంలో ముందుకు సాగిందని తెలిపారు. అనేక రాష్ట్రాలకు విస్తరించిన, ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న నక్సలిజం సమస్యను పూర్తిగా నిర్మూలించే దిశగా పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది కీలక విజయం సాధించారని అన్నారు. నక్సలిజం నిర్మూలనలో విశేషంగా కృషి చేసిన సీఆర్‌పీఎఫ్, దాని కోబ్రా బెటాలియన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల ధైర్యసాహసాలను కూడా ప్రశంసించారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం

## -బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



ఆదిలాబాద్, అక్టోబర్ 22:ఎల్‌నినో కరువు ముందస్తు హెచ్చరికలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ మండిపడ్డారు.

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని చిట్యాల్, బెల్లాల్, మద్దిపడగ, వకీల్ నగర్ తండాలో ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? సాగు పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులతో తక్షణమే పంట నష్టాల సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ జిల్లా అధ్యక్షుడు జక్కుల సత్తయ్య, మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ యాదవ్, ఇస్లావత్ మోహన్ నాయక్, రాపర్తి శ్రీనివాస్, గడప దేవరాజ్, తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# గనుల సుస్థిర పునరుపయోగాన్ని ప్రోత్సహించే సీసీఓ 'సువికల్ప్' కార్యక్రమం.. స్కోచ్ గోల్డ్ అవార్డ్-2026 ప్రదానం

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:గనులను శాస్త్రీయ పద్ధతిలో మూసివేసి, గని తవ్వకాలు పూర్తి అయిన తరువాత భూమిని నిరంతర ఉపయోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధీనంలోని కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) పలు కార్యక్రమాలను అమలుచేస్తోంది.

సువ్యవస్థితమైన, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియ ద్వారా పునరుపయోగానికి ఉపయోగపడగల గని ప్రాజెక్టులను ఎంపిక చేసుకోవడంలో ఆసక్తిదారు సంస్థలకు సాయపడేందుకు 'సువికల్ప్' పేరిట ఓ సంస్థాగత గని పునరుపయోగ ఉపకరణాన్ని సీసీఓ తీసుకు వచ్చింది.

ఈ ఉపకరణం సాంకేతికత, పర్యావరణం, సామాజిక, ఆర్థిక ప్రమాణాలను ఆధారం చేసుకొని పునరుపయోగ ప్రాజెక్టులను మదింపు చేసి, ర్యాంకులను ఇస్తుంది.

తగిన ప్రాజెక్టును గుర్తించిన తరువాత, వినియోగదారు సంస్థలు 'ప్రిజమ్' (పోస్ట్-మైనింగ్ రీపర్పసింగ్ ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీ మోడల్‌కు సంక్షిప్త రూపమిది)ను ఉపయోగించి అమలుకు సంబంధించిన వివిధ ప్రత్యామ్నాయాలను అన్వేషించవచ్చు. ప్రాజెక్టు రూపాలు, అమలు విధానాలు, కేస్ స్టడీస్, నమూనా డీపీఆర్‌లు (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్), టెండర్ డాక్యుమెంట్లతో పాటు అవే రంగాలలో పనిచేస్తున్న ఏజెన్సీల తాలూకు సమాచారాన్ని 'ప్రిజమ్' అందిస్తుంది.

వినూత్నత, ప్రభావశీలత్వం పరంగా 'సువికల్ప్'కు కిందటి నెల 26న జాతీయ స్థాయిలో "డిజిటల్ ఆపరేషనల్ ఎఫీషియెన్సీ–డేటా ఆధారితంగా నిర్ణయాలను తీసుకోవడం" కేటగిరీలో స్కోచ్ గోల్డ్ అవార్డును ఇచ్చారు. విశిష్ట పనితీరును గుర్తించడానికి ఈ స్కోచ్ అవార్డులను ఇస్తున్నారు. ఈ అవార్డులను ఇవ్వడం ద్వారా.. పాలన, సాంకేతికత, నూతన ఆవిష్కరణలతో పాటు ప్రజాహితానికి తోడ్పడే కీలక మార్పులకు దన్నుగా నిలిచే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

గనులను మూసివేయడం, వాటిని మన్నికైన రీతిలో ప్రత్యామ్నాయ పద్ధతులలో ఉపయోగించుకోవడానికి విషయాలు తెలుసుకొని నిర్ణయాలు తీసుకోవడంలో సాయపడడానికి సువ్యవస్థీకృత జ్ఞాన భాగస్వామ్యం, సామర్థ్య నిర్మాణ పెంపు సంబంధిత కార్యక్రమం కింద 'సువికల్ప్ సంవాద్ వెబినార్ సిరీస్'ను కూడా సీసీఓ ఆరంభించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ సిరీస్ బొగ్గు కంపెనీలు, ప్రభుత్వ అధికారులు, సాంకేతిక నిపుణులు, విద్యాసంస్థలతో పాటు ఇతర ఆసక్తిదారులకు గని మూసివేత అనంతర భూమి ఉపయోగానికి సంబంధించిన ఆచరణసాధ్య పరిష్కారాలు, కొత్త కొత్త నమూనాలు, అత్యుత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఒక చోట సమావేశపరిచింది.




తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలలో 'జయంతి పబ్లికేషన్స్' గత కొన్ని దశాబ్దాలుగా 'పుస్తక ప్రచురణ–సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ'లో విశేషమైన సేవలు అందిస్తూ... కొనసాగుతున్నది. తెలుగులోని లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తలు మొదలుకొని వర్ధమాన రచయితల రచనలు 500 లకి పైగా ప్రచురించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కవులు, రచయితలు, కళాకారులను ఒకే వేదిక పైకి తెచ్చి, తెలుగుభాష వికాసానికి అనేక నూతన, రికార్డు స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఘనచరిత్ర కలిగిన సంస్థ... 'జయంతి పబ్లికేషన్స్'

# 65వ జాతీయ కళా ప్రదర్శనలో ఎంపిక చేసిన కళాకారులకు లలిత్ కళా అకాడమి పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22:అరవై అయిదో జాతీయ కళా ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల్లో ఎంపిక చేసిన వారికి లలిత కళా అకాడమి పురస్కారాలను రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలో ఈ రోజు ప్రదానం చేశారు. మూడో ప్రింట్ ఇండియా- (రెండేళ్లకోసారి జరిగే) 2026 లో గ్రాండ్ ప్రైజ్ విజేతలను, గౌరవ ప్రస్తావనలను అందుకున్న కళాకారులను రాష్ట్రపతి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఈ పురస్కారాల ప్రదానోత్సవం భారతీయ కళాత్మక వారసత్వం, సాంస్కృతిక వైవిధ్యం, సమకాలీన సృజనశీలతను పండుగ చేసుకొనే సందర్భమ న్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, మనం భార తదేశంలోని వివిధ కళల సుసంపన్న సంప్రదాయం, సృజన శక్తిలతో పాటు నిరంతరం అభివృద్ధి చెందుతున్న కళాత్మక అభివ్యక్తీకరణగా ఈ ఉత్సవాన్ని జరుపుకొంటున్నామని ఆమె వర్ణించారు.

కేన్వాసుపై చిత్రించిన ఆకృతులు, రాయిని చెక్కి మలచిన శిల్పాలు లేదా వేరువేరు ఇతర మాధ్యమాల్లో రూపొందించిన కళాకృతులకు మాత్రమే కళ పరిమితం కాదని రాష్ట్రపతి అన్నారు. కళ మన సంస్కృతికి అద్దం పడుతుందనీ, జ్ఞాపకాలూ, వర్తమాన అనుభవాలూ, భావి ఆకాంక్షలూ కళలో తొంగిచూస్తాయనీ రాష్ట్రపతి అన్నారు. మనం జీవిస్తున్న కాలాన్నీ, సమాజాన్నీ ఒక కొత్త దృష్టి కోణంలో చూసే, అర్థం చేసుకొనే అనుభవాల్ని కళ పంచిపెడుతుందన్నారు. సుదూర ప్రాంతాల్లో సాంప్రదాయిక కళాకారులకు కొత్త సాంకేతికతలలో, సమకాలీన కళాశైలిలో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ, ఇలా చేసినందువల్ల వారు విస్తృత వేదికల్లో పోటీపడి కళాకారులు ప్రావీణ్యాన్ని చాటగలుగుతారనీ రాష్ట్రపతి అన్నారు.

నేటి ప్రపంచంలో కళాకారులకు వారి ప్రతిభను ప్రదర్శించే అవకాశాలను అందించడం ఒక్కటే కాకుండా ఆర్థిక సహాయాన్నీ, విశాల మార్కెట్టును, కళా సేకర్తలతో పరిచయావకాశాలను కూడా అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి అన్నారు. కళాకృతుల అమ్మకాన్ని ప్రోత్సహించే దిశగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, లలిత కళా అకాడమి కృషి చేస్తున్నాయని తెలిసి తాను సంతోషిస్తున్నానని రాష్ట్రపతి అన్నారు.

కళ ఒక్క ప్రదర్శనశాలలకే పరిమితం అయిపోకూడదు అని రాష్ట్రపతి స్పష్టం చేశారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, బహిరంగ స్థలాలతో పాటు సమాజంలోని సువిశాల వర్గాల చెంతక కళను చేర్చాలని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రతిభను తీర్చిదిద్దుకొనేందుకూ, కొత్త మాధ్యమాలను అనుసరించేందుకూ, సృజనాత్మక శక్తి సామర్థ్యాల పరిధిని విస్తరించుకొనేందుకూ యువ కళాకారులకు, ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తున్న కళాకారులకు తగినన్ని అవకాశాల్ని అందించాల్సిందిగా రాష్ట్రపతి కోరారు.

# పోలీసు సంస్మరణ దినోత్సవం.. పోలీసు సిబ్బందికి ప్రధానమంత్రి నివాళులు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22: పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బందికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. చట్టాన్ని పరిరక్షించడంలో, నేరాలను అరికట్టడంలో, అత్యవసర పరిస్థితులకు ప్రతిస్పందించడంతో పాటు అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ పౌరుల భద్రతకు పూచీపడడంలో పోలీసు ఉద్యోగులు అమూల్యమైన తోడ్పాటును అందిస్తున్నారని ప్రధానమంత్రి అన్నారు.

కర్తవ్య నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు ఉద్యోగులకు శ్రీ మోదీ మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటించారు. వారి ధైర్య, సాహసాలు, అచంచల అంకిత భావం, సర్వోన్నత త్యాగం దేశ ప్రజల మనసులో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఒక సందేశాన్ని ప్రజలతో ప్రధానమంత్రి పంచుకుంటూ "తరచు అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ అసాధారణ నిబద్ధతతో సేవలను అందిస్తున్న మన పోలీసు సిబ్బందికి ప్రగాఢ కృతజ్ఞతలను తెలియజేసుకొనే సందర్భం 'పోలీసు సంస్మరణ దినోత్సవం'. శాంతి భద్రతలను కాపాడడం మొదలు.. నేరాన్ని అరికట్టడం, అత్యవసర పరిస్థితులకు దీటుగా స్పందించడంతో పాటు ప్రజల భద్రతను పరిరక్షించడం వరకు.. వారు అందిస్తున్న సేవలు అమూల్యం. కర్తవ్య పాలనలో ప్రాణాలను అర్పించిన పోలీసు ఉద్యోగులకు మనం మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటిద్దాం. వారి సాహసం, అచంచల అంకితభావం, సర్వోన్నత త్యాగం దేశ ప్రజల మనసులో ఎప్పటికీ స్థిరంగా నిలిచి ఉంటాయి'' అని పేర్కొన్నారు.

# నషా ముక్త్ యువ అభియాన్ అయిదో వారంలో భాగంగా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1,174 కార్యక్రమాలు నిర్వహించిన మై భారత్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22: వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మేరా యువ భారత్ (మై భారత్) 100 వారాల ప్రచారంలో అయిదో వారాన్ని 2026 అక్టోబర్ 17న నిర్వహించింది. "మాదకద్రవ్యాల రహిత యువత కోసం యోగా, ధ్యానం", "వికసిత్ భారత్ కోసం మాదకద్రవ్యాల రహిత యువతపై చర్చ" (పొరుగు ప్రాంత యువజన పార్లమెంట్) అనే అంశాలతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఆధ్యాత్మిక సంస్థలు, విశ్వవిద్యాలయ సంఘాలు, పరిశ్రమల సంఘాల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాలు 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించాయి. మొత్తం 1,174 కార్యక్రమాల్లో 3,43,288 మంది యువత, పౌరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాల్లో నషా ముక్త్ యువ ప్రతిజ్ఞ, యోగా, ధ్యాన సాధన, అవగాహన చర్చలు, యువత భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలు. పొరుగు ప్రాంత యువజన పార్లమెంట్ చర్చలు మాదకద్రవ్యాల రహిత భారత్ లక్ష్య సాధనలో యువత చర్చించేందుకు, చురుగ్గా పాల్గొనేందుకు వేదికగా నిలిచాయి.

హార్ట్‌ఫుల్‌నెస్, ప్రాజెక్ట్ పాయింట్, సీఐపీయూ, అసోచామ్, ఫిక్కీ, సీఐఐ, బ్రహ్మకుమారీస్ వంటి భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ ప్రచారాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మిక సంస్థలు, పరిశ్రమల సంఘాలు, ఇతర భాగస్వామ్య వర్గాలు కలిసి కృషి చేయడం ద్వారా అవగాహనను బలోపేతం చేయడంతో పాటు, యువత, పౌరులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రోత్సహించాలనే సమష్టి సంకల్పం ఈ కార్యక్రమాల్లో ప్రతిబింబించింది.

ఈ ప్రచారంలో భాగంగా మొత్తం 3,380 కార్యక్రమాలు నిర్వహించగా, 3,43,288 మంది మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేశారు. ఇది మాదకద్రవ్య రహిత భారత్ పట్ల తమ నిబద్ధతను చాటడంలో యువత మరియు పౌరుల విస్తృత భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నివారించడం, సమాజ స్థాయిలో అవగాహన పెంపొందించడం కోసం సమష్టి బాధ్యతను ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమాలు వివిధ వర్గాల వారిని ఒకచోట చేర్చాయి.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, భాగస్వామ్య సంస్థల సహకారంతో విస్తృత స్థాయిలో ప్రజలు పాల్గొనడం, ఆరోగ్యకరమైన, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో నిరంతర సమాజ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. 100 వారాల ప్రచారం ద్వారా 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ' అనే లక్ష్య సాధన దిశగా యువత భాగస్వామ్యాన్ని, సమష్టి కార్యాచరణను మేరా యువ భారత్ నిరంతరం ప్రోత్సహిస్తోంది.

# శంకుస్థాపన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



కరీంనగర్, అక్టోబర్ 22: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల భవిష్యత్తుకు వరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన పాఠశాలను తాటిపల్లి-మోరపల్లి శివారులో 25 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఈ నెల 25న మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గురువారం నిర్మాణ స్థలాన్ని, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, 25 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో నిర్మించే ఈ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు వరంగా నిలుస్తుందన్నారు. శంకుస్థాపన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ షాదాబ్ హకీం, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వీరుడు 'పండుగ సాయన్న'..



కరీంనగర్, అక్టోబర్ 22: నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న ప్రజా వీరుడని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు.. నిజాంల ధాన్యం కారాగాన్ని కొల్లగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అని అన్నారు.

ధనవంతుల నుండి, పెట్టుబడుదారుల వ్యవస్థ నుండి భూస్వాముల నుండి, అణగారిన వర్గాలను అణిచివేతకు గురి కాకుండా వారి పై తిరుగుబాటు చేశాడన్నారు. తెలంగాణ ప్రాంత వాసిగా మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలన పై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, కలెక్టరేట్ ఏఓ కిషన్, సిబ్బంది , బీసీ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో ఆయుష్ వైద్య విధానాల ప్రోత్సాహానికి దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన భారత ప్రమాణాల సంస్థ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22: భారతీయ సంప్రదాయ వైద్య విధానాల్లో ప్రామాణీకరణకు మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ఆయుష్ విభాగం ఆయుర్వేదం, యోగా, సోవా-రిగ్పా వైద్య విధానాల్లో ప్రామాణీకరణపై రెండు జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించింది. సంప్రదాయ వారసత్వాన్ని శాస్త్రీయ నాణ్యతా నియంత్రణతో అనుసంధానించడం ద్వారా వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, ఆయుష్ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని బీఐఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రముఖ పరిశోధకులు, పరిశ్రమల అధిపతులు, విద్యారంగ ప్రముఖులు, వైద్య నిపుణులు సహా 600 మందికి పైగా కీలక భాగస్వాములు పాల్గొన్నారు.

కర్ణాటకలోని బెలగావిలో భారతీయ ప్రమాణాల సంస్థ, కేఎల్ఈ శ్రీ బీఎంకే ఆయుర్వేద మహావిద్యాలయం, కేఎల్ఈ ఉన్నత విద్య, పరిశోధనా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ప్రగతి - 2026 సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 600 మంది పాల్గొని, ఆయుర్వేదం, యోగా రంగాలను బలోపేతం చేయడంలో భారతీయ ప్రమాణాల పాత్రపై చర్చించారు. భారతీయ ప్రమాణాల రూపకల్పనలో బీఐఎస్ చేపడుతున్న కృషిని, అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) ద్వారా ప్రపంచవ్యాప్త ప్రామాణీకరణలో భారత్ పాత్రను విస్తరించేందుకు తీసుకుంటున్న చర్యలను బీఐఎస్ శాస్త్రవేత్త?ఇ, ఆయుష్ విభాగాధిపతి శ్రీమతి సృష్టి దీక్షిత్ వివరించారు. సదస్సులో పాల్గొన్న ప్రముఖులు నాణ్యతకు భరోసా కల్పించడం, రోగుల భద్రత, విశ్వసనీయ పరిశోధనలు, సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థల అమలుకు స్పష్టమైన ప్రమాణాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సదస్సులో ప్రధానంగా చర్చించిన అంశాలు ఇవి:

యోగా, ఆయుర్వేదంలో ప్రామాణీకృత ఆచరణ - విద్య: యోగా, ఆయుర్వేద రంగాల్లో ఏకరీతి పరిభాష, విద్యా ప్రమాణాలు, వైద్య మార్గదర్శకాల అవసరాన్ని ప్రముఖులు వివరించారు.

పరిశ్రమలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం: బీఐఎస్ ధ్రువీకరణ పొందడం ద్వారా మార్కెట్‌లోకి ఉత్పత్తులను వేగంగా తీసుకెళ్లడంతో పాటు వినియోగదారుల్లో విశ్వాసాన్ని ఎలా పెంపొందించవచ్చో హిమాలయ వెల్‌నెస్ కంపెనీకి చెందిన డాక్టర్ బిందు ఇందిర, కర్ణాటక ఆయుష్ ఔషధ తయారీదారుల సంఘానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ పాటిల్ సహా పరిశ్రమల ప్రముఖులు మార్గనిర్దేశం చేశారు.

నిపుణులతో ముఖాముఖి: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదకు చెందిన ప్రొఫెసర్ (డాక్టర్) కాశీనాథ్ సామగండి, బీఐఎస్ ఆయుర్వేద విభాగ కమిటీ అధ్యక్షుడు వైద్య జయంత్ దేవ్‌పుజారి నేతృత్వంలోని నిపుణుల బృందం ప్రతినిధులతో ముఖాముఖి చర్చలు నిర్వహించింది. విద్య, పరిశోధన, ఔషధ తయారీ, వైద్య ఆచరణలో ప్రమాణాలను అమలు చేయడంలో ఎదురవుతున్న ఆచరణాత్మక సమస్యలపై చర్చించారు. ప్రమాణాలను విస్తృతంగా అమలు చేసేందుకు పరిష్కరించాల్సిన లోటుపాట్లను కూడా ఈ సందర్భంగా గుర్తించారు.

లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలోని లేహ్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోవా-రిగ్పా (ఎన్ఐఎస్ఆర్)లోబీఐఎస్ తన ఐదో సోవా-రిగ్పా విభాగ కమిటీ సమావేశానికి అనుబంధంగా ఆలోచనల మేధోమథన సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బీఐఎస్ సోవా-రిగ్పా విభాగ కమిటీ అధ్యక్షుడు, ఎన్ఐఎస్ఆర్ వ్యవస్థాపక డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ పద్మ గుర్మెట్, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్‌కు చెందిన డాక్టర్ అర్జున్ సింగ్, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునానీ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ ఉసామా అక్రమ్, బీఐఎస్‌కు చెందిన డాక్టర్ మహే ఆలం పాల్గొన్నారు.

# దసరా వేడుకల ఘర్షణ.. వెల్గటూర్‌లో కొత్త వివాదం

## వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలతో చర్చ
## అసలు సర్పంచ్ ఎవరు.. అంటూ గ్రామస్తుల్లో మేసేజ్‌లు

కరీంనగర్, అక్టోబర్ 22:జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో దసరా వేడుకల సందర్భంగా జరిగిన తోపులాట, ఘర్షణ స్థానికంగా తీవ్ర వివాదానికి దారితీసింది. మంగళవారం రావణవధ, జమ్మి వేడుకల సమయంలో మాజీ సర్పంచ్, భవానీ మాలధారణ స్వాములు మాట్లాడుతుండగా మరో వ్యక్తి జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో ఓ సెల్‌ఫోన్ దుకాణ యజమాని తనపై దుర్భాషలాడి దాడి చేశాడని ఎనిమిదో వార్డు సభ్యుడు ఆరోపించారు.

ఈ ఘటనపై బాధితుడు సర్పంచ్ భర్త గోపీకి ఫిర్యాదు చేసినా, దాడికి పాల్పడిన వ్యక్తి ఆయనకు సన్నిహితుడనే కారణంగా న్యాయం జరగలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన వారు.. వాట్సాప్ గ్రూపుల్లో వీడియోల ప్రచారం, మైక్ ద్వారా ప్రకటనలు చేయించడం గ్రామంలో మరింత ఉద్రిక్తతకు దారితీసింది. పిలిచినా రాకపోతే మంత్రి కాన్వాయ్ అడ్డుకుంటామంటూ సందేశాలు పంపినట్లు ప్రచారం సాగుతోంది. సర్పంచ్ కవిత తరపున ఆమె భర్త గోపీ వ్యవహారాలు నడిపిస్తున్నారనే చర్చ గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. చిన్న వివాదాన్ని పెద్దదిగా చేస్తున్న ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి గ్రామంలో శాంతిభద్రతలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# గుజరాత్‌లో బంగారం అక్రమ రవాణా దందాను ఛేదించిన డీఆర్ఐ

## దాదాపు రూ. 19.41 కోట్ల విలువైన 13 కిలోల విదేశీ బంగారాన్ని స్వాధీనం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22:అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం, సూరత్ అంతర్జాతీయ విమానాశ్రయాల ద్వారా విదేశీ మూలాలున్న బంగారాన్ని భారత్‌లోకి అక్రమంగా రవాణా చేస్తున్న ఒక వ్యవస్థీకృత బంగారు స్మగ్లింగ్ సిండికేట్‌ను డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) భగ్నం చేసింది. దీనికి సంబంధించి కస్టమ్స్ చట్టం-1962 కింద ముగ్గురిని అరెస్టు చేశారు.

కచ్చితమైన నిఘా సమాచారం ఆధారంగా డీఆర్ఐ అధికారులు అనుమానితులపై నిరంతరం నిఘా పెట్టారు. 2026 అక్టోబర్ 16 నాడు ప్రారంభమైన సమన్వయంతో కూడిన సోదాలు.. 42 గంటలకు పైగా కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో ఈ రాకెట్‌కు సంబంధించిన పూర్తి గొలుసు వెలుగులోకి వచ్చింది. విమాన ప్రయాణికుల ద్వారా స్మగ్లింగ్ చేయడం, హ్యాండ్లర్లకు అందజేయడం, అక్రమంగా కరిగించడం, ఒక జ్యువెల్లరీ దుకాణం ద్వారా విక్రయించడం వంటి విషయాలు బయటపడ్డాయి. సుమారు రూ. 19.41 కోట్ల విలువైన 13.017 కిలోల విదేశీ బంగారంతో కూడిన లావాదేవీలు బట్టబయలయ్యాయి. దీనికి సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు.

ప్రాథమిక విచారణలో భాగంగా ప్రయాణికులు అత్యంత చాకచక్యమైన, వినూత్నమైన దాచిపెట్టే పద్ధతులను ఉపయోగించి బంగారాన్ని దేశంలోకి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తేలింది.

ఇందులో రోడియం పూత పూసిన సన్నని బంగారు తీగలు, ట్రాలీ బ్యాగుల లోపలి లైనింగ్‌లలో పొందు పరిచిన బంగారం, బ్యాగుల ఇన్నర్ షెల్స్‌లో దాచిన గోల్డ్ పేస్ట్ ఉన్నాయి. విమానాశ్రయాలకు చేరుకున్న తర్వాత ఈ బంగారాన్ని విమా నాశ్రయాల వెలుపల ఉన్న హ్యాండ్లర్లకు అందజేసి.. మధ్య వర్తుల ద్వారా వడోదరలోని ఒక అక్రమ బంగారం కరిగించే కేంద్రానికి తరలించేవారు. ఆ విధంగా కరిగించిన బంగారాన్ని తదనంతరం నగదు రూపంలో విక్రయాల కోసం అహ్మదాబాద్‌లోని ఒక నగల దుకాణానికి సరఫరా చేసేవారు.

ఈ సమన్వయ ఆపరేషన్ ఫలితంగా సుమారు 890 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు అక్రమంగా కరిగించిన 6.41 కిలోల బంగారానికి సంబంధించిన కీలకమైన ఆధారాలు లభించాయి. సదరు నగల దుకాణంలో నిర్వహించిన తదుపరి సోదాల్లో సరైన పత్రాలు లేని విదేశీ మూలానికి చెందిన బంగారు బిస్కెట్లు, దుబాయ్‌లో ఉన్న ఈ సిండికేట్ ప్రధాన ఫైనాన్షియర్‌తో సంబంధం ఉన్న వేర్వేరు హ్యాండ్లర్ ద్వారా సరఫరా అయిన సుమారు 5.8 కిలోల స్మగ్లింగ్ బంగారానికి సంబంధించిన లావాదేవీల రికార్డులు లభ్యమయ్యాయి.

ఈ ఆపరేషన్ ద్వారా స్మగ్లింగ్ బంగారాన్ని చేరవేయటం, విక్రయించడంలో ప్రయాణికులు, హ్యాండ్లర్లు, మధ్యవర్తులు, బంగారాన్ని కరిగించే కేంద్ర నిర్వాహకులు, నగర వర్తక మార్గాల మధ్య ఉన్న పరస్పర సంబంధాలు బట్టబయలయ్యాయి. ఈ విచారణ సందర్భంగా హ్యాండ్లర్ లేదా ఫైనాన్షియర్, బంగారాన్ని కరిగించే కేంద్ర నిర్వాహకులు, ఇతర కీలక వ్యక్తులను గుర్తించారు. కస్టమ్స్ చట్టం-1962 నిబంధనల ప్రకారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు.

రహస్యంగా దాచిపెట్టటం, విమానాశ్రయాల ద్వారా తరలించటం నుంచి కరిగించడం, ఫైనాన్సింగ్, దేశీయ మార్కెట్‌లో విక్రయాల వరకు ఉన్న ప్రతి గొలుసుకట్టు లింక్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యవస్థీకృత గోల్డ్-స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేసేందుకు డీఆర్ఐ చేస్తున్న కేంద్రీకృత ప్రయత్నాలను ఈ ఆపరేషన్ ప్రధానంగా తెలియజేస్తోంది.

# డీబీఐఎం మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన రక్షణ మంత్రిత్వ శాఖ, రక్షణ విభాగం వెబ్‌సైట్లను ప్రారంభించిన రక్షణ కార్యదర్శి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22 :పునరుద్ధరించిన రక్షణ మంత్రిత్వ శాఖ (ఎంఓడీ), రక్షణ విభాగం (డీఓడీ) వెబ్‌సైట్లను రక్షణ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ 2026 అక్టోబర్ 19న ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతతో, అందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా, వినియోగదారులకు అనుకూలంగా రూపొందించిన ఈ వెబ్‌సైట్లు డిజిటల్ బ్రాండ్ ఐడెంటిటీ మాన్యువల్ (డీబీఐఎం) 3.0, భారత ప్రభుత్వ వెబ్‌సైట్ల మార్గదర్శకాలు (జీఐజీడబ్ల్యూ) 3.0 నిబంధనలకు పూర్తి అనుగుణంగా ఉన్నాయి. ఈ వెబ్‌సైట్ల ద్వారా రక్షణ మంత్రిత్వ శాఖ విధానాలు, కార్యక్రమాలు, కార్యకలాపాలు, నోటిఫికేషన్లు, రక్షణ రంగానికి సంబంధించిన తాజా సమాచారం, ఇతర కీలక వివరాలను పౌరులు, భాగస్వామ్య సంస్థలు, వినియోగదారులు సులభంగా పొందవచ్చు. విస్తృత స్థాయిలో ప్రజలకు సమాచారం చేరడంతో పాటు, అందరికీ సౌలభ్యంగా ఉండేలా ఈ వెబ్‌సైట్లలో 22 భారతీయ అధికారిక భాషల్లో సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. సురక్షితమైన, ఆధునిక డిజిటల్ వేదిక ద్వారా పారదర్శకత, సమర్థత, అందరికీ సమాచార లభ్యత, పౌర కేంద్రితంగా సమాచార పంపిణీని ప్రోత్సహించే ఈ కార్యక్రమం డిజిటల్ ఇండియా, ఈ-గవర్నెన్స్‌పై కేంద్ర ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఉంది.

# పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం.

## -నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి.



సంగారెడ్డి, అక్టోబర్ 22( నేటి నిజం ప్రతినిధి)అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఇన్చార్జి డీఆర్డీఓ ఉమా హారతి అన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# 137 రకాల క్యాన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్ హేతుబద్ధీకరణ నవంబర్ 9 నుంచి సవరించిన ధరల అమలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 19:ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఎంపిక చేసిన షెడ్యూల్ పరిధిలో లేని 137 క్యాన్సర్ ఔషధాలపై వాణిజ్య మార్జిన్లను రసాయనాలు, ఎరువు ల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఔషధాల విభాగానికి చెందిన జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్పీపీఏ) హేతుబద్ధీక రించింది. అధిక వాణిజ్య మార్జిన్ల ను నియంత్రించడం, క్యాన్సర్ చికిత్సను మరింత అందుబా టులోకి తేవడం, క్యాన్సర్ ఔషధాలు రోగులకు సులభంగా లభించేలా చూడటం ఈ చర్య ప్రధాన లక్ష్యాలు. ప్రస్తుత ధరల నిర్మాణాన్ని బట్టి ఎంపిక చేసిన షెడ్యూల్ పరిధిలో లేని క్యాన్సర్ ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్పీ) 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని ఈ చర్య ద్వారా అంచనా వేస్తున్నారు.

ఎన్పీపీఏ 2019లో ప్రయో గాత్మకంగా చేపట్టిన వాణిజ్య మార్జిన్ల హేతుబద్ధీకరణ కార్యక్ర మం విజయవంతమైన నేపథ్యం లో ప్రస్తుత చర్యలు చేపట్టారు. అప్పట్లో 42 క్యాన్సర్ ఔషధాలపై వాణిజ్య మార్జిన్లను 30 శాతానికి పరిమితం చేశారు. ఈ చర్యతో షెడ్యూల్ పరిధిలో లేని క్యాన్సర్ మందులకు చెందిన 526 బ్రాండ్ల గరిష్ఠ చిల్లర ధరలు 90 శాతం వరకు తగ్గాయి. ప్రస్తుతం చేపట్టిన కార్యక్రమంలో ఈ విధానాన్ని మరిన్ని క్యాన్సర్ ఔషధాలకు విస్తరించారు. ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) పరిధిలోని నిపుణుల కమిటీ సిఫారసు చేసిన జాబితా ఆధారంగా ఈ ఔషధాలను ఎంపిక చేశారు.

ఈ నిపుణుల కమిటీలో ప్రముఖ క్యాన్సర్ వైద్యులు, ఇతర వైద్య నిపుణులు, దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రుల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సభ్యులుగా ఉన్నారు. సమగ్రంగా చర్చించిన అనంతరం, వాణిజ్య మార్జిన్ల హేతుబద్ధీకరణ పరిధిలోకి తీసుకురావాల్సిన 137 ఔషధా లను కమిటీ సిఫారసు చేసింది. ఈ జాబితాను ఎప్పటి కప్పుడు నవీకరిస్తారు. కమిటీ సిఫారసు చేసిన ఔషధాలను పరిశీలించిన అనంతరం, ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు, 2013లోని పేరా 19 ప్రకారం గరిష్ఠ చిల్లర ధరపై వాణిజ్య మార్జిన్‌ను 30 శాతానికి ఎన్పీపీఏ పరిమితం చేసింది. 2026 అక్టోబర్ 17న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచారు. క్యాన్సర్ చికిత్సకు అధిక వ్యయం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితు లు, వారి కుటుంబాలకు ఈ చర్య ఎంతో ఊరటనిస్తుందని భావిస్తున్నారు.

గెజిట్ నోటిఫికేషన్ ప్రచురిం చిన ఏడు రోజుల్లోగా తయారీ దారులందరూ సవరించిన ధరల వివరాలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థకు తెలియ జేయాలి. సవరించిన ధరలు 2026 నవంబర్ 9 నుంచి అమల్లోకి వస్తాయి. తయారీదా రులు తమ వెబ్‌సైట్లలో సవరిం చిన ధరల జాబితాలను ప్రదర్శిం చడంతో పాటు, వాటిని ఔషధ విక్రేతలు, ఆసుపత్రులన్నింటికీ విస్తృతంగా చేరవేయాలి. నవంబర్ 9, 2026 నుంచి ఔషధ విక్రేతలు, ఆసుపత్రులు తగ్గించిన ధరలకే మందులను విక్రయిం చాలి. తమ ఫార్మసీల్లోనూ సవరించిన ధరల జాబితాలను ప్రదర్శించాలి. ఆసుపత్రులు కూడా తమ వెబ్‌సైట్లలో సవరిం చిన ఔషధ ధరలను స్పష్టంగా ప్రదర్శించాలి. వినియోగదారులు మందుల తాజా ధరలను తెలుసుకు నేందుకు 'ఫార్మా సహీ దామ్' యాప్, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ అధికా రిక వెబ్‌సైట్‌ను ఉపయోగిం చుకోవచ్చు. క్యాన్సర్ నిరోధక ఔషధాలు గణనీయమైన పరిమాణంలో నేరుగా ఆసుపత్రులు, వైద్య సంస్థలకు సరఫరా జరుగు తున్నందున అమలు తేదీ నుంచి ఆ మందులను సవరి ంచిన ధరలకే అందించే బాధ్యత ఆయా సంస్థలపై ఉంటుంది. తయారీదారులు, పంపిణీదా రులు, రిటైలర్లు సహా ఔషధ విక్రేతలు, ఆసుపత్రులు, వైద్య సంస్థలు నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా రాష్ట్ర ఔషధ నియంత్రణ అధికారులు అవసర మైన చర్యలు తీసుకుంటారు.

క్యాన్సర్ ఔషధాల పంపిణీ, రిటైల్ విక్రయాల్లో అధిక వాణిజ్య మార్జిన్లను నియంత్రించడం, తయారీదారులకు న్యాయబద్ధమైన ఆదాయం లభించేలా చూడటం, కృత్రిమంగా మందుల కొరత సృష్టించకుండా నిరోధించడం ఈ హేతుబ ద్ధీకరణ చర్య ప్రధాన లక్ష్యాలు. రోగులకు సకాలంలో, నిరంతరాయంగా మందులు అందుబాటులో ఉండేలా నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఔషధాల ప్రస్తుత ఉత్పత్తి, సరఫరా స్థాయిలను కొనసాగించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించనుంది.

క్యాన్సర్ ఔషధాలను మరింత తక్కువ ధరకు, సులభంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రోగులు, వారి కుటుంబా లపై ఆర్థిక భారాన్ని తగ్గించేం దుకు ఈ కార్యక్రమం దోహద పడుతుంది. క్యాన్సర్ చికిత్స అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలనే విస్తృత ప్రజారోగ్య లక్ష్యానికి కూడా తోడ్పడుతుంది.

# ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోలు షురూ!

ఆదిలాబాద్, అక్టోబర్ 22: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గురువారం పత్తి పత్తి కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), ప్రైవేట్ ట్రేడర్స్ సమక్షంలో వేలం పాటల ద్వారా పత్తి కొనుగోళ్ల ముహూర్తానికి శ్రీకారం చుట్టగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలు పత్తి ధర రూ. 9,100 చెల్లిస్తామని రైతుల సమక్షంలో పేర్కొన్నారు. ఎందుకు అఖిలపక్ష రైతు సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రారంభ ధర రూ. 9,260 గా నిర్ణయించడంతో ఇదే ధరకు కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. ప్రకృతి విపత్తు, ఎలినినో ప్రభావంగా పంట దిగుబడి చేతికి రాకపోవడంతో తొలి రోజు మొక్కుబడిగానే కొనుగోలు జరిగాయి.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిసిఐ క్వింటాలు కనీస మద్దతు ధర రూ. 8,667 ప్రకటించి కొనుగోళ్లకు ముందుకు రాగా, రైతులు తమ అసంతృప్తి వెళ్లగక్కారు. తేమ శాతం పేరిట ఆంక్షలు విధించి, కపాస్ కిసాన్ యాప్ పేరుతో అనేక నిబంధనలు విధించడం పట్ల రైతులు అసహనం వ్యక్తం చేశారు. పంట నష్టపోయి ఆపదలో ఉన్న రైతులను సిసిఐ ఆదుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రైవేట్ లోను అంతర్జాతీయ మార్కెట్ ధరలు పెరిగినందున పత్తికి క్వింటాల్కు రూ. 10 వేలు చెల్లించాలని రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి, లోకారి పోశెట్టి, చిట్యాల సుహాసిని, విలాస్, ప్రభాకర్ రెడ్డి, రాఘవులు డిమాండ్ చేశారు.

# మొబైల్‌లోనే ప్రభుత్వ సేవలు.. రైతుల కోసం కొత్త పోర్టల్‌ను ప్రారంభించిన శివరాజ్ సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన డిజిటల్ ఇండియా లక్ష్యాన్ని, రైతుల సంక్షేమం పట్ల ఆయన నిబద్ధతను ముందుకు తీసుకెళ్తూ నవీకరించిన అగ్రి వెల్ఫేర్ పోర్టల్‌ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేడు అధికారికంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రైతులు తమ మొబైల్ ఫోన్ల ద్వారానే ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సాయం, విశ్వసనీయ వ్యవసాయ సమాచారాన్ని నేరుగా, సులభంగా పొందేలా చేయడం ఈ పోర్టల్ లక్ష్యం. తద్వారా విధానపరమైన అడ్డంకులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ప్రజలకు, రైతులకు ఎల్లప్పుడూ మొబైల్ ఫోన్ల ద్వారానే ప్రభుత్వం అందుబాటులో ఉండాలన్నది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన లక్ష్యమని తెలిపారు. సాంకేతికత వ్యవసాయ క్షేత్రాలకు, గ్రామీణ సమాజాలకు చేరి రైతుల జీవితాలను సులభతరం చేసినప్పుడే దాని అసలైన ప్రయోజనం నెరవేరుతుందని అన్నారు. అప్‌గ్రేడ్ చేసిన ఈ పోర్టల్ ద్వారా పథకాల వివరాలు తెలుసుకోవడానికి, దరఖాస్తులు సమర్పించడానికి రైతులు ఇకపై పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. వివిధ వెబ్‌సైట్లను వెతకాల్సిన ఇబ్బంది కూడా తొలగుతుంది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్పీఓలు), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీలు), వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అంకుర సంస్థలను కూడా ఈ వేదికపైకి తీసుకురానున్నారు. తద్వారా వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత వ్యవస్థకు ఒకే ఉమ్మడి డిజిటల్ వేదిక అందుబాటులోకి వస్తుంది. విశ్వసనీయ సమాచార ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ, పోర్టల్‌లోని వివరాలు కచ్చితంగా ఉండటంతో పాటు ఎప్పటికప్పుడు నవీకరించేలా చూడాలని అధికారులను శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు.

పాతబడిన లేదా అసంపూర్ణ సమాచారం వల్ల వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతినే అవకాశం ఉందని, అందువల్ల పోర్టల్ విజయవంతం కావాలంటే నిరంతర నవీకరణలు తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు. విద్య పరిమితంగా ఉన్నవారితో సహా చిన్న, సన్నకారు రైతులందరికీ సులభంగా అర్థమయ్యే భాషలో వివరాలు ఉండాలని, ప్రక్రియలు కూడా సరళంగా ఉండాలని ఆయన సూచించారు. అప్పుడే రైతులు ఈ డిజిటల్ వేదికను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపయో గించుకో గలరని పేర్కొన్నారు. పోర్టల్‌తో పాటు ఇతర డిజిటల్ సాధనాలను రైతులు సమర్థంగా వినియోగించుకునేలా దేశవ్యాప్తంగా కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

పోర్టల్ నవీకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేసిన సాంకేతిక బృందం మొత్తాన్ని శివరాజ్ సింగ్ చౌహాన్ అభినందించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ రూపొందించిన డిజిటల్ బ్రాండ్ ఐడెంటిటీ మాన్యువల్ 3.0, భారత ప్రభుత్వ వెబ్‌సైట్ల మార్గదర్శకాలు 3.0కు అనుగుణంగా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. దివ్యాంగులు సహా ప్రతి ఒక్కరూ సులభంగా వినియోగించుకునేలా, మొబైల్ ఫోన్లకు అనుకూలంగా, భద్రతతో కూడిన డిజిటల్ సేవలను అందించేలా దీనిని రూపొం దించారు. పీఎం - కిసాన్, అగ్రిస్టాక్, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సహా ప్రధాన ప్రభుత్వ పథకాలకు ఈ పోర్టల్ ఏకగవాక్ష వేదికగా పనిచేయనుంది. ఒకే ఇంటర్‌ఫేస్ ద్వారా సంబంధిత సేవలు, సమాచారాన్ని రైతులు సులభంగా పొందేందుకు ఇది దోహదపడుతుంది. పోర్టల్ ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి అతీష్ చంద్ర, అదనపు కార్యదర్శి ప్రమోద్ మెహెర్దా, డిజిటల్ వ్యవసాయ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, మంత్రిత్వ శాఖ, జాతీయ సమాచార కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

అన్ని సేవలు ఒకే చోట: వ్యవసాయ మంత్రిత్వ శాఖ పథకాలు, సబ్సిడీలు, నిబంధనలు, డిజిటల్ సేవలకు సంబంధించిన సమాచారం ఒకే పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. దీంతో వివిధ వేదికల్లో సమాచారం కోసం వెతికేందుకు రైతులు వెచ్చించే సమయం, శ్రమ తగ్గుతాయి.

పారదర్శకత పెంపు.. మధ్యవర్తుల ప్రమేయం తగ్గింపు: ఆన్‌లైన్‌లో అర్హతలను తనిఖీ చేసుకోవడం, నేరుగా దరఖాస్తు చేసుకునే సదుపాయం, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా ఆర్థిక సాయం అందించడం వల్ల ప్రక్రియల్లో పారదర్శకత పెరుగుతుంది. మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లోనూ సులభ వినియోగం: గ్రామీణ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పోర్టల్‌ను రూపొందించారు. తక్కువ సామర్థ్యం ఉన్న స్మార్ట్‌ఫోన్లలోనూ, ఇంటర్నెట్ కనెక్టివిటీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లోనూ సజావుగా పనిచేసేలా దీన్ని సరళంగా, వినియోగదారులకు అనుకూలంగా తీర్చిదిద్దారు. సకాలంలో విశ్వసనీయ వ్యవసాయ సమాచారం: వాతావరణ పరిస్థితులు, శాస్త్రీయ సాగు పద్ధతులు, విత్తనాలు, ఎరువుల లభ్యత, వ్యవసాయ ఉత్పత్తుల ప్రస్తుత మార్కెట్ ధరలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని రైతులు సులభంగా పొందగలుగుతారు.

దివ్యాంగులకు సులభంగా అందుబాటు: ప్రజలకు చేరువగా ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఈ పోర్టల్‌ను రూపొందించారు. స్క్రీన్ రీడర్‌లు, సులభమైన నావిగేషన్‌కు ఇది సహకరిస్తుంది. దీని ద్వారా దృష్టి లోపం ఉన్నవారు, ఇతర దివ్యాంగులు కూడా పోర్టల్ సేవలను మరింత సులభంగా వినియోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది.

## 'స్వచ్ఛతా హీ సేవా' ప్రచారం 2026లో పాల్గొన్న గనుల మంత్రిత్వశాఖ, క్షేత్రస్థాయి కార్యాలయాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 19: స్వచ్ఛతా హీ సేవా (ఎస్‌హెచ్ఎస్) ప్రచారం-2026లో గనుల మంత్రిత్వ శాఖ, దాని క్షేత్రస్థాయి కార్యాలయాలు, పరిపాలన నియంత్రణలోని సంస్థలు చురు గ్గా పాల్గొన్నాయి. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుస్థిర భారత్ నిర్మాణం కోసం 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తిని సమష్టి కార్యాచరణగా మార్చాయి. పరిశుభ్రత కార్యక్ర మాలు, పరిశుభ్రత లక్ష్య యూనిట్ల (సీటీయూలు) రూపాం తరం, బహిరంగ ప్రదేశాల శుభ్రత, పారిశుద్ధ్య కార్మికుల (సఫాయి మిత్రల) సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల ద్వారా నిత్య జీవితంలో పరిశుభ్రత, పర్యావ రణ బాధ్యత, ప్రజల భాగస్వా మ్యాన్ని అంత ర్భాగంగా మార్చాలనే తన నిబద్ధతను మంత్రిత్వ శాఖ చాటుకుంది.

గనుల మంత్రి త్వశాఖ కార్య దర్శి శ్రీ కేశవ్ చంద్ర నేతృత్వంలో స్వచ్ఛత ప్రతిజ్ఞతో ఈ ప్రచారం ప్రారంభమైంది. పరిశుభ్రత, వ్యక్తిగత పారిశుద్ధ్యం, సుస్థిరమైన పద్ధతుల పట్ల మంత్రిత్వ శాఖ సమష్టి నిబద్ధతను ఈ సందర్భ ంగా స్పష్టం చేశారు.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి, గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి న్యూఢి ల్లీలోని చాణక్యపురిలో ఉన్న యశ్వంత్ ప్యాలెస్ మార్కెట్‌లో స్వచ్ఛతా హీ సేవా-2026లో భాగంగా నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్కెట్లు పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండేలా చూడటంలో సమష్టి బాధ్యత, ప్రజల భాగ స్వామ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం తెలియజేసింది.

అలాగే న్యూఢిల్లీలోని నేతాజీ నగర్, జీపీఓఏ-3లో ఉన్న ఖనిజ్ కక్ష్‌లో గనుల మంత్రిత్వ శాఖ సఫాయి మిత్రలు, ఉద్యోగుల కోసం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహి ంచింది. పరిశుభ్రమైన, ఆరోగ్య కరమైన కార్యాలయాల నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న విలువైన సేవలను గుర్తించి, వారికి ఆరోగ్య సేవలు అందించడమే ఈ శిబిరం ఉద్దేశం. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం, గౌరవానికి ప్రాధాన్యమివ్వాలనే మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

చెరువులు, ఇతర జలవన రులను శుభ్రం చేయడం తో పాటు పలు కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ క్షేత్రస్థాయి కార్యాలయాలు నిర్వహించాయి. శ్రమదానం, దేవాలయాలు, మా ర్కెట్లు సహా బహిరంగ ప్రదేశాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్ర మాలు చేపట్టాయి.

పర్యావరణంపై అవగాహన పెంపొందించడం, సృజనాత్మకతను ప్రోత్స హించడం, వ్యర్థాలను తిరిగి వినియో గించు కోవడం ప్రాము ఖ్యతను తెలియ జేయడం కోసం పాఠశాలల్లో వ్యాసరచన, వ్యర్థ పదార్థాలతో కళాకృతుల తయారీ పోటీలను కూడా నిర్వహించాయి.

ఈ ప్రచారంలో భాగంగా 10,723 మంది పాల్గొని 136 పరిశుభ్రత లక్ష్య ప్రాంతాలను రూపాంతరం చేశారు. అలాగే 59 బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయగా, 5,498 మంది ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

పరిశుభ్రతను ప్రోత్సహించడం, బహిరంగ ప్రదేశాలను మెరుగుపరచడం, సమష్టి బాధ్యతాయుత భావనను పెంపొందించడం కోసం మంత్రిత్వ శాఖ, దాని క్షేత్రస్థాయి కార్యాలయాలు చేసిన సమష్టి కృషికి ఈ ఫలితాలు నిదర్శనంగా నిలిచాయి.

గనుల మంత్రిత్వ శాఖ, దాని క్షేత్రస్థాయి కార్యాలయాలు 'స్వచ్ఛ భారత్' లక్ష్య సాధనకు తమ నిబద్ధతను చాటుకున్నాయి. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుస్థిరమైన తదేశ నిర్మాణానికి నిరంతర సమష్టి కార్యాచరణ, పర్యావరణ బాధ్యత, ప్రజల భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశాయి.

# ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు



ఆదిలాబాద్, అక్టోబర్ 22: కడెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివాసీ విప్లవ వీరుడు, అమరవీరుడు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు కొమరం భీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానికంగా ఉన్న కొమరం భీమ్ విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు చట్టాలు కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. కొమరం భీమ్ ఆశయాలను స్మరించుకోవడం అంటే కేవలం జయంతి వేడుకలు నిర్వహించడం మాత్రమే కాదని, ఆయన పోరాడిన హక్కులను కాపాడేందుకు కృషి చేయడం కూడా అంతే ముఖ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకల ద్వారా కొమరం భీమ్ త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు గంగన్న నిర్మల్ జిల్లా ఆర్టిఏ మెంబర్ తుమ్మల మల్లేష్ యాదవ్ నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కడెం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముడికే మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బబ్లూ మైనార్టీ మండల అధ్యక్షులు మహమ్మద్ సలీం ,కడెం కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తోట్ల ధర్మయ్య, కడెం గ్రామ కమిటీ అధ్యక్షులు వసి కడెం గ్రామ మాజీ సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్ సామాజిక కార్యకర్త ఛత్రపతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి..

## వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, అక్టోబర్ 22: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం సుల్తానాబాద్లోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఓపీ సేవలు, మందుల నిల్వలు, వైద్య పరీక్షల నిర్వహణ, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు నిర్దేశించిన సమయానికి హాజరై, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓపీ సేవలను మరింత మెరుగుపరచాలని, రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. రోగులు ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రిలో అవసరమైన మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ముందస్తుగా తగిన నిల్వలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. మందుల వినియోగం, నిల్వల వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. అలాగే రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షల కిట్లను సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని, నిల్వలు తగ్గకముందే వాటిని సమకూర్చుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణ, రోగుల వేచిచూసే ప్రదేశాలు, వైద్య పరీక్షల గదులు, వార్డులు, శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధం, రోగులకు అవసరమైన కనీస సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులతో వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. రోగులకు వైద్య సేవల విషయంలో సరైన సమాచారం అందిస్తూ, వారి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



# బహుముఖ ప్రజ్ఞాశాలి న్యాయపతి కామేశ్వరి

న్యాయపతి కామేశ్వరి, రాఘవరావుల గురించి ఈ తరం వారికి ఎక్కువగా తెలియక పోవచ్చు. రేడియో ప్రధాన ప్రసార సాధనంగా, తెలుగు ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకు పోయిన రోజులలో రేడియో 'అక్కయ్య, అన్నయ్య'లుగా ప్రసిద్ధులైన వారిద్దరు, ఆంధ్ర బాలానంద సంఘం పేరుతో 1939-40 నుండి 1955-56 ప్రాంతం వరకు మద్రాసు, ఆ తరువాత హైదరాబాదు నుండి తెలుగులో బాలల సాహిత్యానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ప్రత్యేకంగా వాళ్లిద్దరు కలిసి చేసిన రేడియో కార్యక్రమాలు కొన్ని అజామరాలుగా నిలిచి పోయాయి. వారు రాసి కొంత వరకు బాణీలు కట్టిన కొన్ని పాటలు కంప్యూటర్.ఎం.వి సంస్థ ద్వారా రికార్డులుగా వెలువడ్డాయి.

రేడియో అక్కయ్యగా పేరుపొందిన న్యాయపతి కామేశ్వరి (1908 - 1980) విజయ నగరంలోని 1908లో పండితుల, విద్వాంసుల కుటుంబంలో జన్మించారు.

ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత విశాఖపట్నం లోని క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. తిరిగి విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ 1932లో పూర్తిచేశారు. ఆ కాలంలో బి.ఎ. ఉత్తీర్ణులైన మొట్టమొదటి మహిళ ఆమే. తరువాత కొంతకాలం నూజివీడు ఎస్టేటులో కపిలేశ్వరపురం జమిందారిణి జగదీశ్వరమ్మలు ఇంగ్లీషు నేర్పారు. 1934లో న్యాయపతి రాఘవరావును వివాహం చేసుకున్నారు. తరువాత 1937లో మద్రాసులోని వెల్లింగ్టన్ టీచర్ ట్రైనింగ్ కాలేజీ లో ఉపాధ్యాయ శిక్షణ (ఎల్.టి.) పూర్తిచేశారు. ఇద్దరి అభిప్రాయాలు కలియడంతో భర్తకుతోడుగా, చెన్నై రేడియో కార్యక్రమాలలోను, బాల పత్రిక నిర్వహణలోను ఆమె చురుగ్గా పాల్గొన్నారు.

చెన్నై ఆకాశవాణి కేంద్రం వారు ఆటవిడుపు పేరుతో పిల్లల కార్యక్రమ నిర్వహణ చేపట్టి, ఆ కార్యక్రమ నిర్వహణ బాధ్యలను న్యాయపతి దంపతులకు అప్పగించారు. ఆ విధంగా ఆమె రేడియో అక్కయ్యగా స్థిర పడి పోయారు. రాఘవరావు ఈమెతో పాటుగా రేడియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూం డటంతో, ఆయనకు రేడియో అన్నయ్యగా పేరొచ్చింది. తరువాత ఈ కార్యక్రమం బాలానందంగా రూపాంతరం చెంది ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా పలు సంవత్సరాలు వారిద్దరిచే నిర్వహించడం జరిగింది.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో న్యాయపతి కామేశ్వరి స్త్రీల కార్యక్రమాలకు ప్రయోక్తగా పని

### అక్టోబర్ 23...రేడియో అక్కయ్య వర్ధంతి



చేసేవారు. ఆకాశవాణి హైదరాబాద్ లో పనిచేస్తున్న కామేశ్వరి రేడియోకు అటు పత్రికలకు, రంగస్థలానికి అనేక నాటికలు, కథలు, గేయాలు రాసేవారు. చాలా మంది బాలలను నటులగా, కళాకారులుగా తీర్చిదిద్దారు. అనేక పల్లె ప్రాంతాలలో రేడియో మహిళా మండలలు ఏర్పాటు కావడానికి కృషి చేశారు. పేద మధ్య తరగతి మహిళల అభ్యున్నతికి పాటుపడిన స్త్రీ న్యాయపతి కామేశ్వరి. ఆనాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రశంసలను కూడా ఈమె అందుకున్నారు. బొమ్మల కొలువులు ఉత్సవాలు విహార యాత్రలు నిర్వహించే వారు. సామాజిక స్పృహ కలిగించేవిగా ఉండే ఆమె రచనలలో సహజత్వం ఉట్టిపడేలా ఉండి, సజీవ రూపాలుగా రూపు దిద్దు కున్నవి. కథలు బాలలకు సులభంగా అర్థమై పోతాయి. ఈమె రాసిన కథల్లో " అనగనగా ఆకలి కథ, ఇల్లు ఇరకాటం, ఆ చంద్రం, దోమ కోతి, తాత అవ్వ కథ, అమ్మమ్మ బహుమానం, " కోతి చేష్టలు", నాలుగు ఏనుగుల కథలు ముఖ్యమైనవి. కామేశ్వరి వ్రాసే నాటికలలో ఉన్న పాత్రలు అన్నీ ఆడపిల్లల పాత్రలే ! పిల్లలను చేరదీసి మంచి అలవాట్లు ఏవో, చెడు అలవాట్లు ఏవో కామేశ్వరి విడ మరిచి చెప్పేవారు. ఆంధ్ర బాలానంద సంఘం కార్యక్ర మాల కోసం తన సొంత భవనాన్ని దారాదత్తం చేశారు. కామేశ్వరి ఆశయాల మేరకు మర్రి చెన్నారెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జవహర్ బాల భవన్ ఏర్పాటు చేశారు. మండలి వెంకట కృష్ణారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కామేశ్వరరావు కోరిక మేరకు ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ స్థాపన జరిగింది. 1975లో తొలి అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సందర్భంగా బాల సాహిత్యానికి చేసిన సేవలకు గాను ఆమెను ఘనంగా సత్కరించడమే గాక 1978లో "బాలబంధు" బిరుదుతో ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ వారు సత్కరించారు. 1981లో కామేశ్వరి రచనలను అన్నింటినీ కలిపి " భోగి పళ్ళు " అనే సంకలనంగా తెచ్చారు. బాలానంద మహోద్యమానికి భర్త న్యాయపతి రాఘవ రావుకు సర్వవిధాలా సహకరిం చిన కామేశ్వరి తన 72వ ఏట 1980 అక్టోబర్ 23వ తేదీన ఈ లోకం వదిలి వెళ్లారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాలి

### -నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



మహబూబ్‌నగర్, అక్టోబర్ 22:నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం వీర తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్.. సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ధైర్యసాహసాలు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న జీవితం సామాజిక చైతన్యానికి ప్రతీక అని కొనియాడారు. యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొంది ధైర్యం, ఆత్మవిశ్వాసం, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

సమాజాభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, వెనుకబడిన వర్గాల ప్రజలు విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సమాజంలో సమానత్వం, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డీఆర్ఓ పాండు, బీసీ సంక్షేమ అధికారిణి ఇందిర, డీటీడీవో కోటయ్య, ఆర్డీవోలు అర్చన, జనార్దన్ రెడ్డి, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఖ

# నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

కరీంనగర్, అక్టోబర్ 22: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.

జగిత్యాల పట్టణానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం పంపిణీ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.






# బిజెపి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం....

కరీంనగర్, అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం గురువారం రోజున జిల్లా శాఖ కార్యవర్గ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గా గుర్రాల వెంకట్ రెడ్డి ,బింగి వేణు ఎర్రబెల్లి సంపత్ రావు , దురిశెట్టి సంపత్ ,సిహెచ్. నరసింహరాజు గాజుల స్వప్న , జిల్లా ప్రధాన కార్యదర్శులు గా గుజ్జ శ్రీనివాస్ రావు , మాడ వెంకట్ రెడ్డి కానుమల్ల గణపతి , జిల్లా కార్యదర్శులు గా గుంజేటి శివ కుమార్ ,కోల అశోక్ , సంపెల్లి సంపత్ రావు, చేపురి సత్యం గౌడ్ ,ధాడి సునీత , రెడ్డవేని రాజు , జిల్లా కార్యాలయ కార్యదర్శి గా కాడార్ల విమల్ కుమార్ . జిల్లా ఐటీ కన్వీనర్ అన్నాజి వినీత్ కుమార్ ,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గొడుగు వినోద్ కుమార్ ల నియామకం జరిగింది. జిల్లాలో భారతీయ జనతా పార్టీ నీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి , కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు , నిర్ణయాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి నూతన జిల్లా కార్య వర్గం తగిన కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం సూచించారు.

# ఐడీబీఐలో ప్రభుత్వ వాటాకు సంబంధించి చట్టపరమైన పరిణామాలపై స్పష్టత

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ఐడీబీఐలో ప్రభుత్వ వాటాకు సం బంధించి 2003లో జరిగిన చట్ట పరమైన పరిణామాలపై వ్యాఖ్య లు, అభిప్రాయాలతో కూడిన కథనాలను కొన్ని పత్రికలు, మీడియా వర్గాలు ప్రచురిం చాయి. 2003 కేంద్ర బడ్జెట్ చర్చలు, ఐడీబీఐ (రద్దు) చట్టం- 2003పై పార్లమెంటరీ చర్చ సందర్భంగా ప్రభుత్వ వాటా తగ్గిం పును నియంత్రించే ఉద్దేశంతో సవరణను ప్రతిపా దించినప్పటికీ తిరస్కరణకు గురైందని, ఆమోది ంచిన చట్టంలో అది భాగం కాలేదని మరోసారి స్పష్టమైంది.

తదనంతరం ఆలిండియా ఐడీబీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఇతరులు... కేసులో ఢిల్లీ హైకోర్టు ఈ అంశాన్ని పరిశీలించి 2018 డిసెంబర్ 17న తీర్పు వెలువరించింది. రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ 41, 42 పేరాల్లో న్యాయస్థానం ఈ కింది విధంగా తీర్పునిచ్చింది:

"ఈ న్యాయస్థానం అభిప్రా యం ప్రకారం, దాదాపు 15 ఏళ్ల కిందట పార్లమెంటులో శాసనసభ చర్చ సందర్భంగా చేసిన ప్రకటనలు... ఐడీబీఐ లిమిటెడ్‌లో తన వాటాను తగ్గించుకోకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిరోధిం చలేవు. చర్చ ముగిసిన తర్వాత పార్లమెంటు ఆమోదించిన చట్టం లో ప్రతిపాదిత సవరణ లేదు. సభ ఎదుట చేసిన ప్రకటనలు పార్లమెంటు ఆమోదించిన చట్టానికి ప్రత్యామ్నాయం కావు. ఆ చట్టాన్ని అధిగమించలేవు. ప్రతిపాదిత నిబంధనను చేర్చక పోవటం వెనుకున్న ఉద్దేశం, ప్రాధాన్యత గురించి పార్లమె ంటుకు కచ్చితంగా అవగాహన ఉంటుంది. పైన పేర్కొన్న సందర్భంలో ప్రామిసరీ ఎస్టోపెల్ సూత్రాలు ఏమాత్రం వర్తించవు. పార్లమెంటులో చేసిన ప్రకటనలు ఉద్యోగులకు ఇచ్చిన హామీ అని, ఆ హామీ ఆధారంగా తమ ప్రయోజనాలకు భంగం కలిగేలా వ్యవహరించారనే వాదనను అంగీకరించటం అసాధ్యం. సభ ఎదుట చేసిన ప్రకటనలు ఒక చట్టాన్ని (ఐడీబీఐ రద్దు చట్టం- 2003) రూపొందించే సంద ర్భంలో చేసినవి కాబట్టి, చట్టబ ద్ధమైన వివరణకు సంబంధించి స్థిరమైన సూత్రాలకు అనుగుణ ంగానే ఆ చట్టాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది"

"ఐడీబీఐ రద్దు చట్టం-2003లోని పరిభాషలో ఎలాంటి సందిగ్ధత లేదు. ఐడీబీఐ లిమిటెడ్‌లో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవటాన్ని, ఉపసంహరించుకోవటాన్ని నిషేధించే ఏ నిబంధన ఆ చట్టంలో ఉండే ఆస్కారం లేదు"వాటాను తగ్గించుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేయటానికి ఆధారంగా తీసుకున్న ప్రామిసరీ ఎస్టోపెల్ సిద్ధాంతాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించినందున పైన పేర్కొన్న తీర్పు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఐడీబీఐ లిమిటెడ్‌లో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవటాన్ని, ఉపసంహరించుకోవటాన్ని అడ్డుకునేందుకు ఈ సిద్ధాంతాన్ని ఉపయోగించే వీల్లేదు.

ఐడీబీఐ బ్యాంక్ రూపాంతరం, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ పట్ల ప్రభుత్వ విధానాన్ని పార్లమెంటులో వరుస కేంద్ర బడ్జెట్ ప్రసంగాల్లో స్పష్టం చేశారు.

# తేయాకులో పురుగుమందుల అవశేషాలపై శాస్త్రీయ ఆధారిత పరిమితులను ప్రతిపాదించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:శాస్త్రీయ ఆధారిత ఆహార భద్రతా నియంత్రణను, వినియోగదారుల రక్షణను ప్రోత్సహించేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో భాగంగా తేయాకులో ఎసిటామిప్రిడ్, ఇమిడాక్లోప్రిడ్... రెండు పురుగుమందుల గరిష్ఠ అవశేష పరిమితులను (ఎంఆర్ఎల్) ప్రతిపాదిస్తూ భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ముసాయిదా సవరణలను ప్రకటించింది. శాస్త్రీయ అంచనాలు, సంబంధిత అంతర్జాతీయ పద్ధతులు, భారతీయ వ్యవసాయ అవసరాల దృష్ట్యా పురుగుమందుల అవశేష ప్రమాణాలను సమీక్షించే దిశగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుసరిస్తున్న విధానాన్ని ఈ ప్రతిపాదన తెలియజేస్తుంది.

అక్టోబర్ 16, 2026న భారత గెజిట్‌లో ప్రచురించిన ముసాయిదా ప్రకారం... తేయాకులో ఎసిటామిప్రిడ్‌కు 20 మి.గ్రా పర్ కిలో (20 పీపీఎం), ఇమిడాక్లోప్రిడ్‌కు 50 మి.గ్రా పర్ కిలో (50 పీపీఎం) ఎంఆర్ఎల్ ఉండాలని ఆహార భద్రత, ప్రమాణాల (కలుషితాలు, విష పదార్థాలు, అవశేషాలు) సవరణ నిబంధనలు-2026 ప్రతిపాదిస్తుంది. నిబంధనల తుది ఆమోదానికి లోబడి ఆహార భద్రతా అవసరాల పాటింపు, పర్యవేక్షణ, అమలును సులభతరం చేస్తూ పురుగుమందుల అవశేషాలకు స్పష్టంగా నిర్వచించిన నియంత్రణ ప్రమాణాలను అందించటం ఈ ప్రతిపాదిత పరిమితుల ఉద్దేశం.

జపాన్‌లో 30 పీపీఎం, అమెరికాలో 50 పీపీఎం సంబంధిత పరిమితుల కన్నా తేయాకులో ఎసిటామిప్రిడ్ కు ప్రతిపాదించిన 20 పీపీఎం ఎంఆర్ఎల్ తక్కువగా ఉంది. అంతర్జాతీయ కోడెక్స్ ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని ఇమిడాక్లోప్రిడ్ ప్రతిపాదిత పరిమితిని కూడా రూపొందించారు. భారత ఆహార భద్రతా ప్రాధాన్యతలను, దేశీయ వ్యవసాయ అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూనే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నియంత్రణ పద్ధతులకు ఇస్తున్న ప్రాధాన్యతను ఇవి ప్రతిబింబిస్తున్నాయి.

పురుగుమందుల అవశేష ప్రమాణాల సమీక్ష, సవరణ దిశగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుసరిస్తున్న విస్తృత నియంత్రణ విధానంలో ఈ తాజా ప్రతిపాదన ఒక భాగం. అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారం, అంతర్జాతీయ పద్ధతుల ఆధారంగా ఎంఆర్ఎల్ లను సమీక్షించిన ఆహార భద్రత, ప్రమాణాల (కలుషితాలు, విష పదార్థాలు, అవశేషాలు) సవరణ నిబంధనలు-2024... ఈ ప్రక్రియలో కీలక ముందడుగుగా నిలిచాయి. తగిన నియంత్రణ రక్షణ చర్యలు, వినియోగదారుల భద్రతపై నిరంతర ప్రాధాన్యతను ప్రతిబింబిస్తూ గతంలో చేపట్టిన నియంత్రణ చర్యల్లో భాగంగా అధిక విషపూరితమైనవిగా గుర్తించిన 13 పురుగుమందులను జాబితా నుంచి తొలగించారు.

ఆహార భద్రతా నియంత్రణలో గరిష్ఠ అవశేష పరిమితులు అత్యంత కీలకం. ఆహార పదార్థాల్లో చట్టబద్ధంగా అనుమతించే పురుగుమందుల అవశేషాల గరిష్ఠ సాంద్రతను ఇవి నిర్దేశిస్తాయి. పురుగుమందుల అవశేషాల సమాచారం, ఆహారం ద్వారా శరీరంలోకి చేరే పరిమాణం, సంబంధిత భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ అంచనాల ఆధారంగా వీటిని నిర్ణయిస్తారు. పురుగుమందుల అవశేషాలను పర్యవేక్షించేందుకు, నిర్దేశిత ఆహార భద్రతా అవసరాల అమలును నిర్ధారించేందుకు ఈ ప్రమాణాలు కొలమానాల నియంత్రణ ప్రాతిపదికను అందిస్తాయి.

వ్యవసాయ ఉత్పత్తిలో సమర్థవంతమైన తెగుళ్ల నియంత్రణ ప్రాముఖ్యతను కూడా ప్రతిపాదిత ప్రమాణాలు గుర్తిస్తున్నాయి. నిర్దేశిత పద్ధతులకు అనుగుణంగా, తగిన రీతిలో పురుగుమందులను ఉపయోగించినప్పుడు తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకునేందుకు, పంట నష్టాన్నితగ్గించుకునేందుకు, వ్యవసాయ ఉత్పాదకతను నిలబెట్టుకునేందుకు రైతులకు సహాయపడతాయి. సరైన పంట రక్షణ చర్యలు అందుబాటులో ఉండటం వల్ల తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయ పద్ధతులకూ మద్దతు లభిస్తుంది. వినియోగదారుల భద్రతే అత్యున్నత ప్రాధాన్యతగా వ్యవసాయ ఉత్పత్తి అవసరాలను సమతుల్యం చేయటానికి ఈ నియంత్రణ విధానం ప్రయత్నిస్తుంది.

మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో పురుగుమందుల సగటు వినియోగం తక్కువగా ఉండటం... దేశ వ్యవసాయ పద్ధతులపై కీలక దృక్పథాన్ని అందిస్తుంది. హెక్టారుకు 0.5 కిలోల కంటే తక్కువగా ఉన్న భారత సగటు పురుగుమందుల వినియోగం... ప్రపంచ సగటు అంచనా హెక్టారుకు 2.38 కిలోల కన్నా చాలా తక్కువ. కొలంబియా, బ్రెజిల్, అమెరికాతో సహా పలు దేశాల్లో నమోదైన స్థాయిల కంటే కూడా ఇది తక్కువే.

అంతర్జాతీయంగా అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు... పంటలు, వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ అవసరాలకు తగినట్లుగా విస్తృత శ్రేణిలో పురుగుమందులను జాబితా చేశాయి. అదే తరహాలో భారత నియంత్రణ విధానం కూడా శాస్త్రీయంగా నిర్ణయించిన అవశేష పరిమితుల ద్వారా వినియోగదారులకు తగిన రక్షణ కల్పిస్తూనే, దేశీయ పంట రక్షణ అవసరాలను పరిగణనలోకి తీసుకోవటానికి కృషి చేస్తోంది.

# క్యాన్సర్ పరిశోధనకు బీఎంఎస్ విస్తృత మద్దతుసీ2సీ4సీ సైక్లింగ్‌లో భారత్ నుంచి 14 మంది ఉద్యోగులు



హైదరాబాద్, అక్టోబర్ 22: క్యాన్సర్ పరిశోధనకు నిధులు సమకూర్చడంతో పాటు వ్యాధి బారినపడిన రోగులు, వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రముఖ జీవ ఔషధ సంస్థ బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ (బీఎంఎస్) చేపట్టిన 'కాంటినెంట్ టు కాంటినెంట్ ఫర్ క్యాన్సర్' (సీ2సీ4సీ) కార్యక్రమంలో భారత్‌కు చెందిన 14 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారు. జపాన్‌లో అక్టోబర్ 6 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న ఈ 15 రోజుల సైక్లింగ్ కార్యక్రమంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని ఆరు దేశాలకు చెందిన 55 మందికి పైగా ఉద్యోగులు భాగస్వాములయ్యారు. వీరంతా టోక్యో బే నుంచి ఒటెమాచీ వరకు సుమారు 1,800 కిలోమీటర్లు సైక్లింగ్ చేయనున్నారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి మద్దతు అందించాలనే లక్ష్యంతో ఉద్యోగులు పలుమాసాలుగా ఈ సవాలుకు సిద్ధమయ్యారు. ఐదు బృందాలుగా ఏర్పడిన సైక్లిస్టులు నిర్ణీత మార్గాల్లో ప్రయాణిస్తూ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు. క్యాన్సర్‌తో మరణించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, ప్రస్తుతం వ్యాధితో పోరాడుతున్న వారికి సంఘీభావం తెలపాలనే సంకల్పం పలువురు ఉద్యోగులకు ప్రేరణగా నిలుస్తోంది. రోగులే మా కార్యకలాపాలకు కేంద్రబిందువుబీఎంఎస్ సీనియర్ డైరెక్టర్ శ్రియా దత్ మాట్లాడుతూ.. తమ సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ రోగులే కేంద్రబిందువుగా ఉంటారని తెలిపారు. ఉద్యోగులు రోజువారీ విధులకు అతీతంగా ఒక మంచి లక్ష్యం కోసం కలిసి పనిచేసేందుకు సీ2సీ4సీ అవకాశం కల్పిస్తోందన్నారు.

క్యాన్సర్ బాధితులకు మద్దతు అందించడంలో భారత్‌కు చెందిన ఉద్యోగులు ఇతర దేశాల సహోద్యోగులతో కలిసి పాల్గొనడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.